



2024 పాదముద్రలు

రోడ్‌షోలు.. హామీలు.. ప్రలోభాలు.. బెదిరింపులు.. అయినా ప్రశాంతంగానే ఎన్నికలు జరిగాయి. ఆశలు, అంచనాలు తలకిందులయ్యాయి. జగన్ పార్టీకి తీవ్ర భంగపాటును 2024 మిగిల్చింది. చంద్రబాబు సారథ్యంలోని కూటమికి అనూహ్యమైన విజయాన్ని అందించింది. విర్రవీగి, నోటికి పనిచెప్పిన నేతలంతా నేలకరిచారు. అప్పులకుప్పగా మిగిలిన ఏపీలో ఒక సవాలుగా కూటమి పాలన మొదలైంది. రెండు భిన్న దృశ్యాలకు సాక్షిగా మిగిలిన 2024లో చిత్తూరు జిల్లాపై ప్రభావం చూపిన ప్రధాన సందర్భాల సమాహారం ఇది..

- చిత్తూరు,ఆంధ్రజ్యోతి

జనవరి 2 — ఎంఎస్ బాబు హడావిడి



పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు జనవరి 2వ తేదీన ప్రెస్‌మీట్ పెట్టారు. తనకు ఈ సారి ఎన్నికల్లో వైసీపీ టికెట్ ఇవ్వడం లేదంటూ అధిష్ఠానంపై ఆగ్రహావేశాలను వ్యక్తం చేశారు. ' పైవారు చెప్పినట్లు చేసిన తనకు ఇప్పుడు మంచి పేరు లేదని టికెట్ ఇవ్వకుంటే ఎలా? అంటే దీనికి కారణం పైవారే కదా? దళితులకు అన్యాయం చేస్తున్నారు. సీఎం జగన్ ఓసారి కూడా పిలిచి మాట్లాడలేదు' అంటూ తీవ్ర స్థాయిలో మాట్లాడారు. మళ్లీ జనవరి 5న తేదీన సెల్ఫీ వీడియో విడుదల చేశారు. 'నేనేం తప్పుగా మాట్లాడలేదు. ఎల్లో మీడియా వక్రీకరించింది' అంటూ యూటర్న్ తీసుకున్నారు.పెద్దిరెడ్డి మందలించడంతో ఆయన మాట మార్చారనే ప్రచారం జరిగింది.చివరకు ఏప్రిల్ 6న షర్మిల సమక్షంలో ఎంఎస్ బాబు కాంగ్రెస్‌లో చేరి, మళ్లీ పూతలపట్టు నుంచే అసెంబ్లీకి పోటీ చేశారు.

ఫిబ్రవరి 26 — జగన్ నవ్వుల పాలు



చంద్రబాబు నియోజకవర్గమైన కుప్పానికి తామే నీళ్లిచ్చామని చెప్పుకోవడానికి తాపత్రయపడిన అప్పటి సీఎం జగన్ చివరకు నవ్వులపాలయ్యారు. 2019నాటికి మిగిలిన 10 శాతం కుప్పం బ్రాంచి కెనాల్ పనులను కూడా పూర్తి చేయలేక చేతులెత్తేసిన జగన్, ఫిబ్రవరి 26న కృష్ణాజలాలను వదులుతున్నట్లు రామకుప్పంలో హంగామా చేశారు.అయితే మరుసటి రోజే అక్కడి గేట్లను తీసేయడం, నీటి ప్రవాహం ఆగిపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా జగన్ నవ్వులపాలయ్యారు.

మార్చి 7 — అదృష్టవంతుడు ఆరణి



అసెంబ్లీ టికెట్ ఇవ్వడం కుదరదని చెప్పి రాజ్యసభ సభ్యుడిగా అవకాశం ఇస్తామని జగన్ మోసం చేశాడంటూ చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆరోపించారు.చివరకు జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ సమక్షంలో మార్చి 7న ఆ పార్టీలో చేరి కూటమి కోటాలో తిరుపతి అసెంబ్లీ టికెట్ తెచ్చుకున్నారు. 2019-24 నడుమ చిత్తూరులో వైసీపీ ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన, 2024 నుంచి మరో ఐదేళ్ల పాటు తిరుపతి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించనున్నారు. జూన్ 5న విడుదలైన ఎన్నికల ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలో అత్యధిక మెజార్టీ సాధించారు.

ఏప్రిల్ 29 — బీసీవై అధినేతపై దాడి



పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి స్వగ్రామమైన సదుం మండలంలోని ఎర్రాతివారిపల్లెకు బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ వెళితే.. అక్కడి వైసీపీ నాయకులు ఆయనపై దాడికి దిగారు. 11 వాహనాల్ని ధ్వంసం చేశారు. పోలీస్‌స్టేషన్ ఎదుటే ప్రచార రథాన్ని దగ్ధం చేశారు. చాలా మంది బీసీవై కార్యకర్తల్ని గాయపరిచారు.ఈ సంఘటనకు సంబంధించి ఎన్నికల సంఘం డీఐజీ అమ్మిరెడ్డిని, పలమనేరు డీఎస్పీ మహేశ్వర రెడ్డిని బదిలీ చేసి, సదుం ఎస్‌ఐ మారుతిని సస్పెండ్ చేసింది.కాగా ఎన్నికల అఫిడవిట్‌లో తన పేరుతో, తన భార్య పేరుతో ఉన్న 142 ఆస్తుల వివరాలను చూపించని పెద్దిరెడ్డిపై అనర్హత వేటు వేయాలని బీసీవై నేత రామచంద్రయాదవ్ మే 23వ తేదీన హైకోర్టును ఆశ్రయించారు.

జూన్ 5 — దిమ్మతిరిగేలా ఎన్నికల ఫలితాలు

ఈ ఏడాది మేలో జరిగిన ఎన్నికలు జగన్ పార్టీకి దిమ్మతిరిగే తీర్పునిచ్చాయి. వైసీపీ ఎమ్మెల్యేల, వారి అనుచరుల అరాచకాలను భయంతో మౌనంగా భరించిన ప్రజలు ఓట్ల ద్వారా తమ వ్యతిరేకతను ప్రకటించారు. చిత్తూరు జిల్లాలో పుంగనూరు మినహా అన్ని అసెంబ్లీ స్థానాలతో పాటు ఓ పార్లమెంటు స్థానాన్ని మంచి మెజారిటీలతో కూటమి అభ్యర్థులు దక్కించుకున్నారు. చిత్తూరు పార్లమెంటు పరిధి పరంగా చూస్తే 7 అసెంబ్లీ స్థానాలూ కూటమికే దక్కాయి.ఎంపీ దగ్గుమళ్లకు వచ్చిన మెజార్టీ గతంలో ఎవరికీ రాకపోవడం విశేషం.

జూన్ 15 — గోబ్యాక్ పెద్దిరెడ్డి



దాదాపు 15ఏళ్లుగా పుంగనూరు నియోజకవర్గాన్ని శాసించిన పెద్దిరెడ్డికి పరాభవం ఎదురైంది. జూన్ 15న పుంగనూరుకు వస్తారని తెలిసి పట్టణంలో గోబ్యాక్ పెద్దిరెడ్డి అంటూ కూటమి నేతలు ధర్నాకు దిగారు. దీంతో తిరుపతిలోనే పోలీసులు ఆయన్ను హౌస్ అరెస్టు చేశారు. జూలై 18న ఎంపీ మిథున్‌రెడ్డి పుంగనూరులోని మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంట్లో ఉండగా.. నేతిగుట్లపల్లె ప్రాజెక్టు నిర్వాసిత రైతులు ముంపు భూములకు పరిహారం ఇవ్వలేదని కూటమి నేతలతో కలిసి నిరసనకు దిగారు.జూన్ 28న పుంగనూరు మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా సహా 11 మంది కౌన్సిలర్లు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరేందుకు పార్టీ ఇన్‌ఛార్జి చల్లా బాబును కలవడం చర్చకు దారి తీసింది.

జూన్ 25 — కుప్పంలో సీఎం



ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలో రెండు రోజుల పాటు పర్యటించారు.ఎన్నికలకు ముందు మార్చి 25న అక్కడినుంచే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు.27న పలమనేరులో ప్రజాగళం పేరుతో ప్రచార యాత్ర ప్రారంభించి పుత్తూరు,మదనపల్లెల్లో పర్యటించారు. రెండో విడతలో మే 7వ తేదీన రాజంపేట ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి పుంగనూరులో ప్రచారం నిర్వహించారు. మే 11న చిత్తూరులో ప్రజాగళం నిర్వహించి తన ప్రచారాన్ని ముగించారు.

29 నవంబర్ — భయపెట్టిన తుపాన్లు

ఆగస్టు, సెప్టెంబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో సంభవించిన నాలుగు తుపాన్లు జిల్లాలో వానలు కురిపించాయి.పలు చెరువులు నిండిపోగా ఎన్టీఆర్, కృష్ణాపురం ప్రాజెక్టుల గేట్లు ఎత్తేశారు.సదుం, నగరి, శ్రీరంగరాజపురం,విజయపురం ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగి రోడ్లను అడ్డగించాయి.పంటలను ముంచెత్తాయి.

జూలై 5 — చిత్తూరు మున్సిపాలిటీ టీడీపీ పరం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలలోనే చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని మేయర్ అముద సహా 21 మంది కార్పొరేటర్లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ హయాంలో దొంగ సంతకాలతో, అక్రమ ఏకగ్రీవాలతో చాలా మంది కార్పొరేటర్లుగా గెలిచిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా చూసుకుంటే మున్సిపాలిటీ మొత్తం టీడీపీకి దక్కడం చిత్తూరు నుంచే ప్రారంభమైంది. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చిత్తూరు అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని కార్పొరేటర్లను టీడీపీలోకి ఆహ్వానించినట్లు ప్రకటించారు.

18 డిసెంబర్ — కుప్పంపై భువనేశ్వరి దృష్టి



సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంపై ఆయన సతీమణి నారా భువనేశ్వరి ప్రత్యేక దృష్టి సారించారు. ఏప్రిల్ 19వ తేదీన చంద్రబాబు తరఫున నామినేషన్ వేశారు. మే 7, 8 తేదీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి అధికారంలోకి వచ్చాక జూలై 23న కుప్పం వచ్చిన ఆమె నాలుగు రోజుల పాటు పర్యటించారు. ఈ నెల 18వ తేదీన కుప్పం చేరుకుని నాలుగు రోజుల పాటు ఆమె నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, మహిళలతో సమావేశమయ్యారు.కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి చంద్రబాబుతో పాటు ఆయన కుటుంబం కూడా కట్టుబడి వుందని ప్రకటించారు.



మద్యం మత్తులో తహసీల్దార్ల దాడి



తహసీల్దార్ల దాడితో నోట్లో నుంచి రక్తం వస్తోందని చూపిస్తున్న కృష్ణకుమార్

చిత్తూరు అర్బన్, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో సోమవారం రాత్రి ఫుల్లుగా మద్యం సేవించిన ఇద్దరు ఇన్‌ఛార్జి తహసీల్దార్లు వీధిరౌడీల్లా ప్రవర్తించి దారినపోయేవారిని భయపెట్టారు. నగరం లోని ప్రభా గ్రాండ్ హోటల్ ఎదురుగా మెయిన్ రోడ్డుపై కృష్ణకుమార్ అనే వ్యక్తి మీద దాడి చేసి బండ బూతులు తిట్టారు.ఈ దాడిలో అతడికి గాయాలయ్యాయి. చిత్తూరులో నివాసం ఉంటున్న కృష్ణకుమార్ ఇటీవల పలమనేరు ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించినట్లు తెలుస్తోంది.ఆ ఇద్దరు తహసీల్దార్లతో కలిసి హోటల్‌లో మద్యం సేవించినట్లు సమాచారం.ఆ సందర్భంగా మాటామాట పెరిగి ఇలా దాడి చేశారనే చర్చ నడుస్తోంది. దయచేసి నన్ను వదిలేయండి సార్ అని కృష్ణకుమార్ ప్రాధేయపడుతున్నా.. చుట్టూ ఉన్నవారు నిలువరిస్తున్నా..తహసీల్దార్లు వినకుండా అతడి మీదకు వెళ్లి దాడిచేయడం చుట్టూవున్న జనాన్ని ఆశ్చర్యపరిచింది. ఓ తహసీల్దార్ సెల్ నుంచి మరో తహసీల్దార్ .....కృష్ణకుమార్‌తో మాట్లాడి కొడతామని హెచ్చరిస్తున్న కాల్ రికార్డింగ్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

ఉదయం 3 గంటలనుంచే వరసిద్ధుడి దర్శనం

పకడ్బందీగా నూతన సంవత్సరాది ఏర్పాట్లు : ఈవో కిషోర్

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జనవరి ఒకటిన కాణిపాక ఆలయానికి విచ్చేసే ప్రతి భక్తుడికీ స్వామి దర్శన భాగ్యం కల్పిస్తామని ఈవో పెంచలకిషోర్ తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేకం, అనంతరం మూల విరాట్‌కు చందనాలంకారం నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నట్లు వివరించారు. జనవరి 1న వేకువ జామున 3 గంటలకే స్వామి దర్శనాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.ఉచిత దర్శనంతో పాటు రూ.100,రూ.150 దర్శన క్యూలైన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.భక్తులకోసం 8వేల పెద్దలడ్డూలు, 80వేల చిన్న లడ్డూలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.ప్రసాదాలను భక్తులు కొనుగోలు చేయడానికి కౌంటర్లను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.ఈఈ వెంకటనారాయణ, ఏఈవోలు రవీంద్రబాబు,ధనంజయ, హరిమాధవరెడ్డి,ఎస్‌ఐ ధరణీధర, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

నేడు జడ్పీ సమావేశం

చిత్తూరు రూరల్, డిసెంబరు 30: జిల్లా పరిషత్ సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు సీఈవో రవికుమార్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు.

నేడు చిత్తూరులో జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక పద్రర్శన

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన మంగళవారం చిత్తూరులోని లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించనున్నట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు.టీచర్, విద్యార్థుల గ్రూపులతో పాటు విద్యార్థుల వ్యక్తిగత విభాగాల్లో దాదాపు 93 నమూనాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

రెవిన్యూ సదస్సులకు 75 అర్జీలు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో సోమవారం నిర్వహించిన రెవిన్యూ సదస్సులకు 75 అర్జీలు అందాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.17 రెవిన్యూగ్రామాల్లో నిర్వహించిన ఈ సదస్సుల్లో ఆర్వోఆర్‌కు సంబంధించి 23, ప్రభుత్వ భూములకు సంబంధించి 20, ఇతరత్రా సమస్యలకు సంబంధించి 36 అర్జీలు అందాయన్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో విరిగిన పగడ చెట్టు కొమ్మలు

భక్తులు లేకపోవడంతో తప్పిన ముప్పు



విరిగిపడిన పగడచెట్టు కొమ్మలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం 300 ఏళ్ల నాటి పగడ చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. ఆ సమయానికి భక్తులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని రాయలవారి మండపం పక్కనే పగడ చెట్టు ఉంది. ప్రస్తుతం రాయలవారి మండపంలో రూ.500 రాహుకేతు పూజలను జరిపిస్తుంటారు. అటు రాహుకేతు పూజలకు వచ్చే భక్తులతో పాటు పక్కనే ఉన్న ఉచిత ప్రసాదాలను స్వీకరించిన భక్తులు కూడా పగడచెట్టు కిందకు చేరుతుంటారు. ఈ క్రమంలో సోమవారం చెట్టు నుంచి రెండు భారీ కొమ్మలు ఒక్కసారిగా విరిగిపడ్డాయి. ఆ సమయంలో భక్తులు లేకపోవడంతో ముప్పు తప్పింది. ఇటీవల వర్షాలకు కొమ్మలునాని బరువు ఎక్కడం, చెట్టు వేరు వ్యవస్థకు నీరు చేరకపోవడం వల్ల కొమ్మలు బలహీన పడినట్లు అధికారులు భావిస్తున్నారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తులతో కిక్కిరిసింది. సోమవారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 28వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2.738మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,615మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,856మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,265, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 414మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 383మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 153మంది భక్తులు పూజలుచేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 25,745 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.



ముక్కంటి ఆలయం వద్ద ఉన్న భక్తులు

'కొండ'ంత ప్రక్షాళనకు అడుగులు

తిరుమలలో గాడిన పడుతున్న పాలన ● వైసీపీ పాలనలో అక్రమాలు.. కూటమి నేతృత్వంలో సంస్కరణలు

గతిస్తున్న ఈ ఏడాదిలో టీటీడీ మున్నెన్నడూ లేనివిధంగా జనం నోళ్లలో నానింది. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకాలు ఐదేళ్లు కొనసాగినా కూటమి ప్రభుత్వ ఏర్పడ్డాక బహిర్గతమై చర్చనీయాంశమయ్యాయి. దీంతో జాతీయ స్థాయిలో సైతం ముక్కున వేలేసుకునే పరిస్థితి ఏర్పడింది. దర్శనాలు మొదలుకుని లడ్డూ తయారీ వరకూ ఏమేరకు గాడితప్పాయో తేటతెల్లమైంది. జూన్ నుంచి సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఆలయంలో ప్రక్షాళన ప్రారంభమైంది. కొత్త బోర్డు సారథ్యంలో కొద్ది కాలంగా నెమ్మదిగా పాలన దారిన పడుతోంది. 2024 నిష్క్రమిస్తున్న వేళ వీటిలో ముఖ్యాంశాలను ఒకసారి అవలోకనం చేసుకుందాం...

- తిరుమల, ఆంధ్రజ్యోతి

గత పాలకవర్గంలో మరకలు

●ఎన్నికల సమయంలో కావడంతో ఈ ఏడాది తొలి నుంచీ వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఇష్టానుసారం వీఐపీ బ్రేక్ టికెట్లు కేటాయించారు. జిల్లా మంత్రులకైతే రోజుకు 30 నుంచి 40 దర్శనాలు కూడా కేటాయించేవారు. లేఖపై ఆరుగురికే దర్శనం ఇవ్వాలనే నిబంధనను పదికి పెంచేశారు. బోర్డు ఛైర్మన్ నుంచి సభ్యుల వరకు అడ్డుఅదుపులేకుండా పోయింది.

●ముస్లింలకు శ్రీవారిసేవ అవకాశం కల్పిస్తామని, ఇతర మతస్తులపై హిందూమతంలోని పవిత్రజలాన్ని చల్లి ఆహ్వానిస్తామని ఫిబ్రవరిలో గత ఛైర్మన్ భూమన కరుణకర్‌రెడ్డి, ఈవో ధర్మారెడ్డి చేసిన ప్రకటనలు తీవ్ర దుమారం లేపాయి. భక్తుల్లో ఆందోళన కలిగించాయి.

● నిబంధనలకు విరుద్ధంగా శారదామఠం తిరుమలలో చేపట్టిన నిర్మాణాలు నాటి ప్రభుత్వ తీరుకు దర్పణం పట్టింది.

● టీటీడీ, అధికారులు, బోర్డు, సీఎం, అహోబిలం మఠం, జీయర్‌స్వాములు, అర్చకులపై ఆరోపణలు చేస్తున్నట్టుగా ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై గత బోర్డు రమణదీక్షితులను టీటీడీ నుంచి తొలగించింది. కేసు కూడా నమోదు చేసింది.

● పరకామణిలో దొంగతనం కేసు తీవ్రస్థాయిలో దుమారం రేపింది. దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయకుండా గత టీటీడీ, పోలీసులు రాజీ కుదుర్చుకోవడంపై మొదలైన విమర్శలు నేటికీ కొనసాగుతున్నాయి.

కూటమి పాలనలో సంస్కరణలకు శ్రీకారం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే టీటీడీ ఈవోగా శ్యామలరావును నియమించింది. స్వామిక్షేత్రానికి పూర్వ వైభవం తీసుకొచ్చే బాధ్యతలను అప్పగించింది. జూన్ 16న బాధ్యతలు తీసుకున్న ఆయన తొలిప్రాధాన్యతగా లడ్డూలు, అన్నప్రసాదాల నాణ్యతపై దృష్టిపెట్టారు. లడ్డూకు వాడే నెయ్యిలో నాణ్యత లేదని గుర్తించారు. కొన్ని సరఫరా సంస్థలను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారు. నందిని వంటి సంస్థల ద్వారా నాణ్యమైన నెయ్యి దిగుమతికి చర్యలు తీసుకుని భక్తుల ప్రశంసలకు పాత్రులయ్యారు.

● ఇక, అవసరం లేకపోయినప్పటికీ నిర్మాణాల పేరుతో కోట్లాది రూపాయలు రోడ్లు, భవనాలు, ఆస్పత్రుల పేరుతో మళ్లించడం కూడా టీటీడీ వార్తల్లో నిలిచింది. రాజకీయ లబ్ధికోసమే టీటీడీ నిధులతో తిరుపతిలో రోడ్లు వేశారనే విమర్శలు వైసీపీని వెంటాడాయి.

మారిన అన్నప్రసాదాల రుచి

అన్నప్రసాదాల నాణ్యతపై దృష్టిపెట్టారు. బియ్యం, కూరగాయలు, ముడిసరులకు ల విషయంలో శ్రద్ధ తీసుకున్నారు. దీంతో అన్నప్రసాదాల నాణ్యత మెరుగుపడింది. వైసీపీ ప్రభుత్వానికి ముందున్న పద్ధతుల్లోనే రుచికరంగా నైవేద్య అన్నప్రసాదాలను నివేదిస్తున్నారు.దిట్టం పెంచారు. భక్తులకూ స్వామి ప్రసాదాలు అందేలా చర్యలు తీసుకున్నారు.

శీఘ్ర దర్శనానికి అడుగులు

● తిరుమలక్షేత్రాన్ని గత వైసీపీ నాయకులు రాజకీయ ప్రసంగాలకు వేదికగా మార్చుకున్న తీరుపై నవంబరు 6న బీఆర్ నాయుడు ఆధ్వర్యంలోని బోర్డు తొలి సమావేశంలోనే బ్రేక్ పెట్టారు. రాజకీయాలు మాట్లాడితే కేసులు పెట్టేలా తీర్మానించారు.

● నిబంధనలు అతిక్రమించిన శారదమఠం లీజునూ రద్దు చేశారు.

● ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)టెక్నాలజీ ద్వారా గంట నుంచి రెండు గంటల్లోనే దర్శనమయ్యేలా కృషి మొదలుపెట్టారు.



● అన్యమత ఉద్యోగులను తిరుమల నుంచి పంపేలా ప్రణాళికలు రూపొందించారు.

● స్వామి సొమ్ముకు భద్రతను కల్పించేలా ప్రభుత్వ బ్యాంకుల్లోనే డిపాజిట్లు చేయాలని నిర్ణయించారు.

● గత ప్రభుత్వంలో రూ.కోట్లు కొల్లకొట్టేందుకు దారి చూపిన టూరిజం దర్శన టికెట్ల కోటాను రద్దు చేశారు.

● గత ప్రభుత్వం నిలిపివేసిన స్థానికుల దర్శన విధానాన్ని పునరుద్ధరించి తిరుపతి వాసుల మనసు గెల్చుకున్నారు. ● అర్హులకే బ్రేక్ దర్శనాలు కల్పిస్తున్నారు. నాలుగైదు కిలోమీటర్లు ఉండే సర్వదర్శన క్యూలైన్లు ప్రస్తుతం కనిపించడం లేదు.

● స్వర్ణాంధ్ర విజన్-2047 తరహాలో 'తిరుమలవిజన్-2047'కి శ్రీకారం చుట్టి తిరుమల అభివృద్ధికి కసరత్తు చేస్తున్నారు.

● గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై స్టేట్ విజిలెన్స్ ఫోకస్ పెట్టింది.

'ఏపీకే ఫైల్' ఓపెన్ చేయొద్దు: ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): 'సైబర్ నేరగాళ్లు ఏపీకే ఫైల్‌తో న్యూ ఇయర్ విషెస్ పదాన్ని వాడుకుని ట్రేడింగ్ చేసి డబ్బులు కాజేయడానికి సిద్ధమవుతున్నారు. అలా వచ్చిన ఏపీకే ఫైల్‌ను ఓపెన్ చేయకండి. ఒకవేళ ఓపెన్ చేస్తే మీ ఫోన్ కంట్రోల్ అంతా సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లిపోతుంది. మీ మొబైల్ యాప్స్, మొబైల్‌లో జరిగే ప్రతి కదలికలను గుర్తిస్తారు. బ్యాంకు ఖాతాల వివరాలు, ఫొటోలు, వీడియోలు, కాంటాక్టు నెంబర్లు, ఇతర ఫైల్స్ తీసుకుంటారు. మీకు తెలియకుండానే డబ్బులు కాజేస్తారు' అని ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు. నూతన సంవత్సర సందేశాల విషయంలో జాగ్రత్తగా ఉండాలంటూ సోమవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొబైల్‌లో ఉన్న ఏపీకే వంటి స్కామ్ ఫైల్స్‌ను తక్షణమే తొలగించాలని సూచించారు. ఎక్కడైనా సైబర్ నేరం జరిగిందని తెలిసిన వెంటనే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ క్రైం బారిన పడినవారు తిరుపతి పోలీసు మైదానంలోని సైబర్ క్రైం ఆఫీసుకు వెళ్లి ఫిర్యాదు చేయాలన్నారు.

గంజాయి స్వాధీనం

● ఇద్దరు ఒడిశా యువకుల అరెస్టు

శ్రీకాళహస్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో ఏడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరు ఒడిశా యువకులను అరెస్టు చేసినట్లు రెండో పట్టణ పోలీసులు సోమవారం తెలిపారు. ప్రభుత్వాస్పత్రి రోడ్డులో ఇద్దరు యువకులు గంజాయితో సంచరిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నారు. గంజాయి సహా ఇద్దరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఒడిశాకు చెందిన బిజయ్(29), సుక్కు(25)గా గుర్తించి కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు.

ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు

● రూ.ఆరు లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు జైలు శిక్ష, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ ఎర్రచందనం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి సోమవారం తీర్పునిచ్చారు. దీనికి సంబంధించి భాకరాపేట సీఐ ఇమ్రాన్‌బాషా తెలిపిన ప్రకారం.. పీలేరు మండలం రేగల్లుకు చెందిన లింగం అశోక్, పీలేరుకు చెందిన క్రాంతికుమార్ 2016లో ఆటోలో నాలుగు ఎర్రచందనం దుంగలను అక్రమంగా తీసుకెళుతున్నారు. ఈ విషయం తెలిసి భాకరాపేట పోలీసులు ఆటోను తనిఖీ చేశారు. నాలుగు దుంగలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండుకు పంపారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి.. ఒక్కొక్కరికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు.

శ్రీవారి ఆలయంలో అధ్యయనోత్సవాల ప్రారంభం



తిరుమల, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో అధ్యయనోత్సవాలు సోమవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులోభాగంగా రాత్రి 7.30 నుంచి 8.30 గంటలవరకు రంగనాయక మండపంలో కార్యక్రమాలు నిర్వహించారు. ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశికి 11 రోజుల ముందు నుంచి 25 రోజుల పాటు వీటిని నిర్వహించడం ఆనవాయితీ. కార్యక్రమంలో జీయర్‌స్వాములు, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జాతీయ పడవ పోటీలకు ఆంధ్రా క్రీడాకారులు



ఢిల్లీకి బయలుదేరిన క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో జనవరి 3-6మధ్యలో జరిగే నేషనల్ డ్రాగన్‌బోట్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 31 మంది క్రీడాకారులు పయనమయ్యారు. శ్రీకాకుళం, విజయనగరం, ఏలూరు, విజయవాడ, నెల్లూరు, కర్నూలు, తిరుపతి జిల్లాల నుంచి డ్రాగన్ బోట్ క్రీడాకారులు వారం రోజులుగా రాయలచెరువులో శిక్షణ తీసుకున్న విషయం తెలిసిందే. సోమవారం రాత్రి శ్రీనివాస క్రీడా సముదాయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో శాప్ ఛైర్మన్ రవినాయుడు క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. జాతీయస్థాయి పోటీలలో రాణించి అధిక పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్, ప్రదీప్‌నాయుడు, డీఎస్ఏ కోచ్‌లు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన టీటీడీ ఛైర్మన్

తిరుమల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడిని టీటీడీ ధర్మకర్తల మండలి ఛైర్మన్ బీఆర్ నాయుడు సోమవారం అమరావతిలో కలిశారు. తిరుమలలో భక్తులు గంటల తరబడి క్యూలైన్లు, కంపార్టుమెంట్లలో వేచిఉండే అవసరం లేకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా త్వరితగతిన దర్శనం కల్పించే ప్రయత్నాలు చేస్తున్నట్టు సీఎంకు ఆయన వివరించినట్లు తెలిసింది. ఏఐ ఏర్పాటుకు ముగ్గురు నిపుణులతో కూడిన కమిటీని వేయాలని సీఎంను కోరగా, సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. అలాగే స్విమ్స్ ఆస్పత్రి నిర్వహణకు టీటీడీ నుంచి ప్రతి ఏడాది రూ.వంద కోట్లు నష్టం వాటిల్లుతోందని, ఆరోగ్యశ్రీ నుంచి రూ.80 కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. అలాగే చిన్నపిల్లల ఆస్పత్రి, స్విమ్స్‌లో నూతన భవనాల నిర్మాణాలు, వాటి ఖర్చుపై సీఎంకు వివరించగా వెంటనే వాటిని నిలిపివేసేలా బోర్డులో నిర్ణయం తీసుకున్నట్టు సీఎంకు ఛైర్మన్ వివరించినట్లు తెలిసింది. ఉద్యోగులకు నేమ్ బ్యాడ్జీ, టీటీడీలో అన్యమత ఉద్యోగుల బదిలీ, వీఆర్ఎస్ తదితర అంశాలను ప్రస్తావించినట్లు సమాచారం.

ప్రతి అర్జీకీ పరిష్కారం చూపండి

● అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశం

● కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 284 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలకు సంబంధించి వచ్చే ప్రతి అర్జీకీ పరిష్కారం చూపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 284 అర్జీలు అందగా అందులో భూసమస్యలపై 148, పంచాయతీరాజ్‌కు 90 ఉన్నాయి. సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు అర్జీలు స్వీకరించారు.

ముంతాజ్ హోటల్ నిర్మాణం ఆపాలంటూ ధర్నా



శ్రీవారి పాదాల చెంత చేపట్టిన ముంతాజ్ హోటల్ నిర్మాణాలను నిలుపుదల చేయాలని పలు హిందూ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మద్యం, మాంసం, స్పా, స్విమ్మింగ్ పూల్ వంటి వాటితో వెలుస్తున్న ముంతాజ్‌హోటల్ నిర్మాణం పూర్తయితే హిందువుల మనోభావాలు దెబ్బతింటాయని తిరుక్షేత్రాల రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మా ఓంకార్ పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట హిందు సంఘాల నాయకులు కిరణ్, సుధాకర్‌చౌదరి, రమాదేవి, నీలకంఠ, మధు, బాబు, రాజేంద్రప్రసాద్, వెంకటేష్ ధర్నా చేపట్టారు. బీజేపీ నేతలు కూడా ఆందోళన చేపట్టారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు వినతిపత్రం అందజేశారు.

కాలనీకి రోడ్డు వేయండి

తిరుపతి నగర పరిధిలోని ఒకటో డివిజన్ అన్నమయ్య మార్గం పక్కనే ఉన్న మస్తాన్‌నాయుడు కాలనీ(కొత్తపల్లి)కి రోడ్డు వేయాలని కాలనీ వాసులు కలెక్టర్‌ను కోరారు. గుంతలమయంగా ఉన్న మట్టి రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నామని, డ్రైనేజీ వ్యవస్థ లేక ఇళ్ల మధ్యే మురుగునీరు ప్రవహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణంతో పాటు డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కోరారు. కాగా, తమ ఇళ్లను అన్యాయంగా కూల్చివేశారని, న్యాయం చేయాలని రేణిగుంట మండలం చెంగారెడ్డిపల్లె వాసులు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు.

దివ్యాంగుడికి మూడు చక్రాల సైకిల్



శ్రీకాళహస్తి మండలం ఎంపేడుకు చెందిన దివ్యాంగుడు ఈశ్వరయ్యకు జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారి వినోద్ కలిసి సోమవారం ట్రైసైకిల్ అందజేశారు. తాను టేబుల్ ఫ్లవర్స్ వ్యాపారం చేస్తున్నానని, రెండు కాళ్లు లేవని, ట్రైసైకిల్ అందజేస్తే వ్యాపారానికి ఉపయోగపడుతుందని గత పీజీఆర్ఎస్‌లో చేసిన అభ్యర్థనపై స్పందించిన కలెక్టర్ స్పందించి, అందజేశారు.

కులగణనలో న్యాయం చేయండి



షెడ్యూల్ కుల గణనలో ఎస్సీ మాదిగకు బదులుగా ఎస్సీ ఆది ఆంధ్ర, ఎస్సీ ద్రావిడ నమోదు కావడాన్ని సరిదిద్ది ఎస్సీ మాదిగలుగా పరిగణించాలని ఎమ్మార్పీఎస్ నేతలు నరేంద్రబాబు, గోపి మాదిగ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తిరుపతి జిల్లాలో నగరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, చంద్రగిరి నియోజకవర్గాల్లో దాదాపు 70శాతం మాదిగలను ఎస్సీ ఆది ఆంధ్ర ఉప కులంగా చూపుతున్నారని, తక్షణం సరిదిద్ది ఎస్సీ మాదిగలుగా నమోదు చేయాలని కోరారు.

సోలార్ టాప్‌తో విద్యుత్ ఆదా చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ చంద్రశేఖరరావు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూర్యాఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ ఈఈ చిన్నకోటి చంద్రశేఖరరావు విజ్ఞప్తి చేశారు. పాత తిరుచానూరు రోడ్డులోని విద్యుత్ ఈఈ కార్యాలయంలో సోమవారం సాయంత్రం కాంట్రాక్టర్లతో ఆయన సమావేశమయ్యారు. గృహాలపై సోలార్ టాప్‌లను అమర్చుకుని విద్యుత్ పొదుపు చేసుకోవాలని కోరారు. రాయితీ పథకాలను వినియోగించుకుంటేమరిన్ని ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. డిప్యూటీ ఈఈ ఆంజనేయులు, జయప్రకాష్, మునిప్రసాద్, రమేష్‌లు, ఏఈలు, సోలార్ రూఫ్‌టాప్ కంపెనీల కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలు పెరిగాయి

సాధారణ దొంగతనాలు తగ్గాయి

● వివాహేతర సంబంధాలు, కుటుంబ తగాదాతోనే పలు హత్యలు

● ఎస్పీ సుబ్బరాయుడు వెల్లడి



అధికారులతో కలిసి మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం),డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):'జిల్లాలో ఈ ఏడాది సైబర్ నేరాలు పెరిగాయి.కానీ, పోలీసు శాఖ తీసుకున్న ముందస్తు చర్యలతో సాధారణ నేరాలు తగ్గాయి' అని ఎస్పీ సుబ్బరాయుడు వెల్లడించారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ సావేరి అతిథి గృహంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో వార్షిక నేర గణాంకాలను ఎస్పీ వెల్లడించారు. 2023లో సైబర్ నేరగాళ్ల రూ.2.45 కోట్లు దోచుకోగా.. రూ.84.08 లక్షలు రికవరీ చేశామన్నారు. ఈ ఏడాది రూ.12.89 కోట్లకుగాను రూ.2.36 కోట్లను రికవరీ చేసి బాధితులకు ఇచ్చామన్నారు. మొబైల్ హంట్ ద్వారా ఇప్పటి వరకు రూ.7.56 కోట్ల విలువచేసే దాదాపు 4275 సెల్‌ఫోన్లు రికవరీ చేశామన్నారు. జిల్లాపోలీసులు టెక్నాలజీని వినియోగించి ఐదు సంచలనాత్మక కేసులను ఛేదించినట్లు తెలిపారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగే దాదాపు 100 బ్లాక్ స్పాట్‌లను గుర్తించామన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన 882 ఫిర్యాదుల్లో 762 పరిష్కరించినట్లు తెలిపారు. పారదర్శకత, పౌర స్నేహక పోలీసింగ్‌ను మెరుగుపరచడానికి 'పోలీసు వెబ్ సైట్ ప్రారంభించామన్నారు. దొంగతనాలు, నేరాలు, రోడ్డు ప్రమాదాలు, వైట్ కాలర్ నేరాలు, ఇతర నేరాల గురించి గణాంకాల సహా వివరించారు. ఇక, ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ద్వారా ఆరు నెలల్లో దాదాపు 100 కేసులు నమోదు చేసి 2061 దుంగలు.. 108 వాహనాలు సీజ్ చేసినట్లు చెప్పారు. ముగ్గురిపై పీడీ యాక్టు పెట్టామన్నారు. కోర్టు మానటరింగ్ వ్యవస్థ ద్వారా అన్ని శాఖలను సమన్వయం చేసుకోవడంతో పోక్సో హత్యలకు సంబంధించి 13 కేసుల్లో కొందరికి జీవిత ఖైదు, మరికొందరికి ఐదారేళ్ల జైలు శిక్షలు పడ్డాయన్నారు. వివాహేతర సంబంధం, కుటుంబ తగాదాలు, బంధువుల మధ్య గలాటాల కారణంగా చాలావరకు హత్యలు జరిగాయని అభిప్రాయపడ్డారు.

గంజాయిపై ఉక్కుపాదం

ప్రత్యేక టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేసి ఆరు నెలల్లో గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. 85 కేసులు నమోదు చేసి 872.307 కిలోలు, 17 వాహనాలను స్వాధీనం చేసుకుని 223 మందిని అరెస్టు చేశామన్నారు. 239 మందిపై గంజాయి షీట్స్ ఓపెన్ చేశామన్నారు. విద్యా సంస్థల్లో 241 డ్రగ్స్ నిరోధక కమిటీలు ఏర్పాటు చేశామన్నారు.

వీవీఐపీల భద్రతకు పెద్దపీట

'ఏడాది కాలంలో దాదాపు 1069 మంది వీవీఐపీలు జిల్లాకు వచ్చారు. శాంతి భద్రతలకు విఘాతం లేకుండా వీరికి భద్రత కల్పించాం. తిరుమల బ్రహ్మోత్సవాలు, శ్రీకాళహస్తి మహాశివరాత్రి ఉత్సవాల్లోనూ భక్తుల మనోభావాలకు భంగం వాటిల్లకుండా బందోబస్తు ఏర్పాటు చేశాం. తిరుచానూరు ఉత్సవాలు బ్రహ్మాండంగా జరిగాయని సీఎం చంద్రబాబు అభినందించారు' అని ఎస్పీ పేర్కొన్నారు.

రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం అభినందనీయం

రేణిగుంట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాల ఉత్పత్తులు, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించడం అభినందనీయమని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడిలోని రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వరిలో డ్రమ్ సీడర్, భూసార పరీక్షా ఆధారిత ఎరువుల యాజమాన్యం, డ్రోన్‌ల వినియోగం, సమగ్ర వ్యవసాయ విధానాలను రైతులకు చేరువ చేయడంలో కేవీకే కృషి అద్భుతమన్నారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఐసీఏఆర్ అటారీ డైరెక్టర్ ఎన్ షేక్‌మీరా, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ప్రసంగించారు. రైతులకు ప్రదర్శన క్షేత్రాల నిమిత్తం విత్తనాలు, పనిముట్లను పంపిణీ చేశారు. రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



పనిముట్లను పంపిణీ చేస్తున్న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

దక్షిణ భారత సాంస్కృతిక విజేతగా ఎస్వీయూ

11 అంశాల్లో వర్సిటీకి బహుమతుల పంట



మెడల్స్‌తో ఎస్వీయూ విద్యార్థులు, అధికారులు - ట్రోఫీ అందుకుంటున్న ఎస్వీయూ విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత సాంస్కృతిక విజేతగా ఎస్వీ యూనివర్సిటీ నిలిచింది. చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వేదికగా నిర్వహించిన దక్షిణ భారత సాంస్కృతికోత్సవంలో ఎస్వీ యూనివర్సిటీకి చెందిన కళా బృందాలు, విద్యార్థులు పోటీల్లో పాల్గొని ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. క్లే మోడలింగ్‌లో మొదటి స్థానం, పోస్టర్ మేకింగ్‌లో మొదటి స్థానం, ఇన్‌స్టాలేషన్‌లో ద్వితీయ స్థానం, రంగోళిలో ద్వితీయ స్థానం, మెహందీలో ద్వితీయ స్థానం, క్లాసికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో నాల్గవ స్థానం, ర్యాలీలో నాల్గవ స్థానం, డ్యాన్స్‌లో ఐదవ స్థానం, లైట్ ఓకల్‌లో ఐదవ స్థానం, కొల్లేజ్‌లో ఐదవ స్థానం, క్లాసికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో ఐదవ స్థానంలో నిలిచి ఎస్వీయూ విద్యార్థులు బహుమతుల పంట పండించారు. వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు వారిని అభినందించారు. ప్రభుత్వ సహకారంతో వచ్చే ఏడాది యూనివర్సిటీ వేదికగా దక్షిణ భారత సాంస్కృతికోత్సవం నిర్వహిస్తామని అన్నారు.

నూతన సంవత్సర వేడుకలకు పోలీసుశాఖ మార్గదర్శకాలు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలు నూతన సంవత్సరాన్ని సుఖ, సంతోషాలతో జరుపుకోవాలని, అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలని ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. జిల్లా వ్యాప్తంగా రోడ్ల వద్ద చెక్‌పోస్టులు, పికెటింగ్‌లు ఏర్పాటు చేసి రాత్రి 10 గంటల నుంచి ఉదయం వరకు వాహనాల తనిఖీ కార్యక్రమం ఉంటుందన్నారు. వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. అనంతరం ఆయన ప్రత్యేక మార్గదర్శకాలు విడుదల చేశారు. ● మద్యం షాపులు, బార్‌లు ప్రభుత్వం నిర్ధేశించిన సమయానికి మూసివేయాలి. ● బహిరంగ ప్రదేశంలో మద్యపానం, ట్రిపుల్ రైడింగ్‌లు పూర్తిగా నిషిద్ధం. మద్యం సేవించి వాహనాలు నడిపితే రూ.10వేలు జరిమానా, ఆరు నెలల జైలు. ● చిత్తూరు నగరంలోని ప్రధాన రోడ్లు, ఫ్లైఓవర్‌లపై నూతన సంవత్సర వేడుకలు నిషేధం. ● ద్విచక్రవాహనాలకు సైలెన్సర్లను తీసి పెద్ద శబ్ధంతో వాహనాలు నడిపితే అలాంటి వారిపై కఠిన చర్యలు. ● నూతన సంత్సరం సందర్భంగా సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడితే కేసుల నమోదు. ● రోడ్లపై కేక్ కటింగ్‌లకు అవకాశం లేదు. ● ప్రజల రక్షణార్థం డిసెంబరు 31 రాత్రంతా బ్లూకోట్, రక్షక్ టీమ్‌లు గస్తీలు చేస్తారు. ● ప్రజలెక్కడైనా అసౌకర్యానికి గురైతే డయల్ 100, 112 లేదా సంబంధిత పోలీసు స్టేషన్‌కు లేదా పోలీసు వాట్సాప్ నెంబరు 94409 00005కు ఫోన్ చేయాలి.

ఈవీఎం గోదాము వద్ద నిరంతర భద్రత



రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఈవీఎం గోదామును తనిఖీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదామును కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి త్రైమాసికానికోసారి ఈవీఎంలను భద్రపరిచిన గోదామును కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తుంటామన్నారు. అనంతరం గోదాములో భద్రపరిచిన ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్లకు సీల్ ఉందో లేదో పరిశీలించారు. బయట భద్రతా విధులు నిర్వహిస్తున్న పోలీసులతో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ భద్రతా ఏర్పాట్లు పటిష్ఠంగా ఉండాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో డీఆర్వో మోహన్‌కుమార్, వివిధ పార్టీల ప్రతినిధులు సురేంద్రకుమార్ (టీడీపీ), అట్లూరి శ్రీనివాసులు (బీజేపీ), పరదేశి (కాంగ్రెస్), గంగరాజు (సీపీఎం), ఉదయకుమార్ (వైసీపీ), ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ వాసుదేవన్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి సాగు పనులకు 'ఉపాధి'ని అనుసంధానం చేయాలి

● సమస్యలు పరిష్కరించాలంటూ పీజీఆర్ఎస్‌కు మొత్తం 169 అర్జీలు



బాధితురాలి సమస్యను వింటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి మొత్తం 169 అర్జీలు అందాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో మోహన్ కుమార్, ఇతర జిల్లా అధికారులు వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూశాఖకు 136, పోలీసుశాఖకు 10, పంచాయతీరాజ్‌కు 3, జిల్లా రిజిస్ట్రార్‌కు 2, మిగిలిన ఆర్టీసీ, హౌసింగ్, డీటీడబ్ల్యూవో, స్కిల్ డెవలప్‌మెంట్, డీఆర్‌డీఏ తదితర శాఖలకు 18 అర్జీలు అందాయి. వాటిలో కొన్ని...

● జిల్లాలో మామిడి పంటల ఒబ్బిడికి ఉపాధి హామీ పనులను అనుసంధానం చేయాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ ఏపీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. పెట్టుబడి ఖర్చు పెరిగిపోయిందని, మందుల పిచికారీకి, పంట కోతకు ఉపాధి హామీ పథకం ద్వారా ఆర్థిక సహకారం అందించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఆ సంఘ నేతలు వెంగమేష్ చౌదరి, బుల్లెట్ రవి, పూర్ణచంద్రారెడ్డి, డేవిడ్, ధనంజయ నాయుడు, రమణ, కోదండ నాయుడు తదితరులు ఉన్నారు.

● వ్యవసాయ భూములకు దారి లేకుండా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వెదురుకుప్పం మండలం జక్కిదొన, గంటావారిపల్లె పంచాయతీ ప్రజలు కోరారు. జయమ్మ అనే మహిళ ప్రభుత్వానికి చెందిన మేత భూమిని, చెరువును ఆక్రమించుకుని ముళ్ల కంచెలు చుట్టారని తెలిపారు. దాంతో రైతులు భూముల వద్దకు వెళ్లడానికి దారిలేకుండా పోయిందన్నారు. తహసీల్దార్‌కు పలుమార్లు అర్జీలిచ్చినా పట్టించుకోవడం లేదన్నారు.

● శ్మశానానికి దారి లేకపోవడంతో దహనక్రియలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నామని యాదమరి మండలం నర్రావూరు దళితవాడకు చెందిన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎవరైనా చనిపోతే రైతుల పొలాల్లో నుంచి వెళ్లేవారమని, ఇప్పుడు వారు కూడా వద్దంటున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి శ్మశానానికి దారి వసతి కల్పించడంతో పాటు శ్మశాన స్థలాన్ని సర్వే చేసి హద్దులు చూపించాలని కోరారు.

● తమకు తెలియకుండానే సెటిల్మెంట్ భూమిని అగ్రకులస్థులు వేరే వారికి అమ్మేశారని జీడీ నెల్లూరు మండలం నెల్లేపల్లె దళితవాడకు చెందిన ధనమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఈ భూమి తప్ప వేరే ఆధారం లేదని, తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు.

● రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను పార్లమెంటులో అవహేళన చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను వెంటనే కేంద్రమంత్రి మండలి నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఐ, సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి వ్యాఖ్యలకు వ్యతిరేకంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, గంగరాజు, సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

● ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంపై జిల్లా, మండల అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టి పనిచేయాలని ఆదేశించారు.

కారు ఢీకొని వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ఒకరికి తీవ్ర గాయాలు

చౌడేపల్లె, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందాడు. ఒకరు చలి కాచుకుంటుండగా కారు అదుపుతప్పి ఢీకొన ఓ వృద్ధుడు మృతిచెందాడు. మరో ఘటనలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో ఒక మహిళ మృతిచెందగా ఆమె భర్తకు తీవ్రగాయాల య్యాయి. ఎస్‌ఐ నాగేశ్వరావు కథనం మేరకు..

చలి కాచుకుంటూ ఉండగా..

మండలంలోని దుర్గసముద్రానికి చెందిన చెంచయ్య(62) రాత్రి 10.30 గంటల సమయంలో సచివాలయం సమీపంలో అగ్గిమంటలు వేసుకుని చలి కాచుకుంటున్నాడు. అదే గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం కారులో వెళుతూ అదుపుతప్పి ప్రమాదవశాత్తూ ఆయన్ను ఢీకొన్నాడు. స్థానికులు 108 సమాచారం అందించారు. వారు చెంచయ్యకు ప్రథమ చికిత్సలు కల్పిస్తుండగానే మృతిచెందాడు. ఎస్‌ఐ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీఆర్‌ఏ రెడ్డెప్పఫిర్యాదుతో కేసునమోదు చేశారు.

అత్తగారింటికి వెళ్లి తిరిగి వస్తుండగా

గంగవరం మండలం కీలపట్ల పంచాయతీ మాదిగపల్లెకు చెందిన రెడ్డెప్ప(34), తన భార్య శివకుమారి (32)తో కలిసి ద్విచక్ర వాహనంలో నిమ్మనపల్లెలో అత్తగారింటికి వెళ్లాడు. తర్వాత తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో తిరుపతిలోని ఓ ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ హరిప్రసాద్ తన కుటుంబంతో కలసి కదిరికి కారులో బయలుదేరారు. బోయకొండ రోడ్డులో చిన్నకొండామారి వద్ద నిమ్మనపల్లె నుంచి వస్తున్న ద్విచక్రవాహనాన్ని అదుపుతప్పి ఢీకొన్నారు. ద్విచక్ర వాహనంలోని రెడ్డెప్ప, శివకుమారి దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. ఎస్‌ఐ నాగేశ్వరావు 108 వాహనంలో వారిని చిత్తూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శివకుమారి మృతి చెందింది. కేసు నమోదు చేశారు.





దుర్గసముద్రం వద్ద కారు ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన చెంచయ్య - తీవ్రగాయాలపాలైన శివకుమారి, రెడ్డెప్పలు

కంటైనర్ ఢీకొని మహిళ మృతి

పూతలపట్టు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కంటైనర్ లారీ ఢీకొని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్న మహిళ మృతి చెందింది. పాకాల మండలం చెన్నుగారిపల్లికి చెందిన రాజశేఖర్ భార్య రూప(27) బంగారుపాళ్యం మండలంలోని అమరరాజా కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. ఆమె ప్రతిరోజులాగానే సోమవారం ఉదయం 4.30 గంటల సమయంలో ఉద్యోగానికి వెళ్లేందుకు మండలంలోని పి.కొత్తకోట బస్టాప్ వద్ద అమరరాజా బస్సు ఎక్కేందుకు రోడ్డు దాటుతుండగా తిరుపతి వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో రూప అక్కడికక్కడే మృతిచెందింది. ఈ మేరకు సీఐ కృష్ణమోహన్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



రూప (ఫైల్‌ఫొటో)

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నగరి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మొలకెత్తిన విత్తనాలు అమ్మడానికి వెళుతూ రోడ్డు ప్రమాదంలో హరినాయుడు(32) అనే వ్యక్తి మృతి చెందాడు. నగరి సీఐ మహేశ్వర్ కథనం మేరకు వివరాలు... నగరి మండల పరిధిలోని తడుకుపేట పంచాయతీ ఎస్వీపురం గ్రామానికి చెందిన హరినాయుడు రోజూ మొలకెత్తిన విత్తనాలు, ఉసిరి, జామ లాంటి జ్యూస్‌లను తీసుకెళ్లి నగరిలో ఇంటింటా విక్రయిస్తుంటాడు. సోమవారం ఉదయం జ్యూస్, మొలకెత్తిన విత్తనాలను ద్విచక్ర వాహనంలో తీసుకెళుతుండగా చెన్నై నుంచి తిరుమల వెళుతున్న కారు ఢీకొనడంతో హరి నాయుడు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 వాహనం ద్వారా నగరి ఏరియా వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



హరినాయుడు(ఫైల్‌ఫొటో)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


● ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు



డీవీఎంసీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలతో కూడిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పథంలో పయనించాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో డీవీఎంసీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు పాడి ఆవుల పెంపకంలో గోకులం షెడ్లను ఏర్పాటు చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. భూమిలేని ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ బంజరు భూముల్లో గోకులం షెడ్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇంటి నిర్మాణానికి 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని, వీటిలో ఎస్సీ, ఎస్టీలకు నాణ్యమైన నిర్మాణాలను చేపట్టాలన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ మైక్రో ఇరిగేషన్, గోకులం షెడ్లు, సూర్యఘర్ పథక ంలో రాయితీలపై అవగాహన పెంచుకుని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలోని వసతి గృహాల్లో మరమ్మతులకై రూ.47 లక్షలతో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం అట్రాసిటీ బాధితులకు మానిటరింగ్ రిలీఫ్ ఫండ్‌పై అధికారులతో చర్చించారు. మంజూరయ్యే నిధులను ఎప్పటికప్పుడు బాధితులకు అందించాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీఎఫ్‌వో భరణి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, జిల్లా అధికారులు, డీవీఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

ఊటీని తలపించింది!



చుట్టూ ఎత్తయిన కొండలు, చల్లటి ఈదురు గాలి, దట్టమైన పొగమంచు, మనసుకు హత్తుకునే నీటి బిందువుల నడుమ ఊటీని తలపించే దృశ్యాలు సోమవారం పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి పంచాయతీలో కనువిందు చేశాయి. కనుచూపు మేర పచ్చని చెట్లు, అక్కడక్కడా పల్లెలను గుర్తించే భవనాలు, చెరువుల నీటి కళకళలు నడుమ ఆకాశంలో మబ్బులు నృత్యమాడుతున్న అపురూప దృశ్యాలు చూపరులను కట్టి పడేశాయి. పంచాయతీ పరిధిలో సుమారు 500 అడుగుల ఎత్తులోని మల్లేశ్వరకొండపైనుంచి కన్పిస్తున్న అందమైన దృశ్యమిది.

- కల్లూరు, ఆంధ్రజ్యోతి

కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక ప్రారంభం / 25 సీసీ కెమెరాల నిఘాలో దేహదారుఢ్య, సామర్థ్య పరీక్షలు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు సంబంధించిన పోలీసు కానిస్టేబుల్(సివిల్, ఏపీఎస్‌పీ) అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ చిత్తూరు పోలీసు పెరేడ్ మైదానంలో సోమవారం ప్రారంభమైంది.ఒక ఏఎస్పీ, ఐదుగురు డీఎస్పీల పర్యవేక్షణలో దేహదారుఢ్య, సామర్థ్య పరీక్షలు పకడ్బందీగా జరిగేలా చర్యలు చేపట్టారు. మొదట సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించి బయోమెట్రిక్, ఎత్తు, ఛాతీ కొలతలు తీసుకుని 1600 మీటర్ల పరుగు పందెంతో పాటు 100 మీటర్లు, లాంగ్‌జంప్ విభాగాల్లో అభ్యర్థుల ప్రతిభను పరీక్షించారు. ఈ ఎంపిక ప్రక్రియలో సాంకేతికతను వినియోగించి హాజరైన ప్రతి అభ్యర్థికి ఆర్‌ఐడీ నెంబరును అభ్యర్థుల ఛాతీకి అతికించారు. వీటి ద్వారా ఎవరెవరు ఎంత సమయంలో పరుగు పూర్తి చేశారో తెలుస్తుంది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేసి రిజల్ట్ కౌంటర్ వరకు విధుల్లో ఉన్న అధికారులకు, సిబ్బందికి ఎస్పీ మణికంఠ పలు సూచనలు చేశారు. అనంతరం పరుగుపందేలను ప్రారంభించారు. ఈ పందెంలో అలసిపోయి సొమ్మసిల్లిన అభ్యర్థులకు డాక్టర్ల చేత వైద్యం అందించారు.తొలిరోజు 600 మందికి గాను 293 మంది హాజరు కాగా 155 మంది అర్హత సాధించారు.ఏఆర్ ఏఎస్పీ శివానంద కిశోర్, చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్ బాషా, ఎస్‌బీ సీఐలు భాస్కర్, మనోహర్, సీఐలు జయరామయ్య, రిజర్వు సీఐలు సుధాకర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థుల ఛాతీ, ఎత్తు కొలతలను చూస్తున్న ఎస్పీ మణికంఠ



వంద మీటర్ల పరుగుపందెంలో అభ్యర్థులు

ఫిబ్రవరి 28లోగా జీవన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు వారి జీవన ధ్రువీకరణ పత్రాలను 2025 జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28లోగా ఉపఖజానా కార్యాలయంలో సమర్పించాలని చిత్తూరు ఎస్టీవో చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. జీవన్ ప్రమాణ్ అప్లికేషన్‌ద్వారా కానీ, జీవన్‌ప్రమాణ్ ఫేస్‌అప్లికేషన్ ద్వారా కాని చిత్తూరు ఉపఖజానా కార్యాలయంలో అందించాలన్నారు. బయోమెట్రిక్ (వేలిముద్రలు) సరిగా లేనివారు, ఆరోగ్యం సరిగ్గా లేక మంచానికే పరిమితమైన వారు ఉపఖజానా కార్యాలయంలో తెలియజేస్తే సిబ్బంది పెన్షనర్ వద్దకు వెళ్లి లైఫ్ సర్టిఫికెట్‌ను ధ్రువీకరిస్తారని తెలిపారు. వివరాలకు 77802 79158ను సంప్రదించాలి.

వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు ఐక్యం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లెల వెంకట్రావు

పుంగనూరు, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు ఐక్యం కావాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు పిలుపునిచ్చారు. సోమవారం పుంగనూరు బీఎంఎస్‌క్లబ్ ఆవరణలో చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప అధ్యక్షతన ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలల మహాగర్జన సభ జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగం ప్రమాదంలో పడిందన్నారు. మాలమహానాడు వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు యమలా సుదర్శనం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పార్లమెంటలో బిల్లు పాసు చేయాల్సివుండగా వర్గీకరణపేరుతో మాదిగ కులస్తులను ప్రధాని మోదీ, మందకృష్ణ మాదిగ మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పంతగాని రమేష్ మాట్లాడుతూ వర్గీకరణతో మాలబిడ్డల భవిష్యత్ అంధకారమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సమతాసైనిక్‌దళ్ అధ్యక్షుడు రాజేశ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు వేసిన కమిటీకి మాలలు వ్యతిరేకంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ మాలలు రాజకీయాలకు అతీతంగా ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. అంతకుముందు స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్దగల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి బీఎంఎస్ క్లబ్‌లో సభ వద్దకు వెళ్లారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోబాటు కర్ణాటక నుంచి మాలలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సమాశంలో మాల నాయకులు ఐఎఫ్ఎస్ విశ్రాంత అధికారి గౌతమి, కొండలరావు, ఎన్.అశోక్‌కుమార్, సుబ్రహ్మణ్యం, జయకుమార్, రామకృష్ణ, చిన్నబ్బ, అంజిబాబు, సుమిత్ర, ఈశ్వరయ్య, టి.శ్రీనివాసులు, రెడ్డెప్ప, మహానంది, కమలమ్మ, ఈశ్వరమ్మ, వెంకటేశ్, రాజేంద్ర, టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరకు వస్తువుల పేరుతో మోసం కేసులో నిందితుడి అరెస్ట్

కల్లూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): తన భార్యకు ఆరోగ్యం సరిగా లేదని, ఫ్రిజ్, స్కూటర్, ఏసీ మిషన్ తక్కువ ధరకు ఇస్తానని ఓ మహిళతో పాటూ మరో వ్యాపారిని మోసగించిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు కల్లూరు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.ఆయన కథనం మేరకు... శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం వెంకటగారిపల్లెకు చెందిన రమేష్ (37) ఏడేళ్లుగా భార్యాబిడ్డలకు దూరమయ్యాడు. జల్సాలకు అలవాటుపడి డబ్బులు సంపాదించేం దుకు వంచన మార్గాన్ని ఎంచుకున్నాడు. ఈనెల 17వ తేదీన కల్లూరు పట్టణంలో పాల వ్యాపారం చేసుకుంటున్న అరుణ అనే మహిళను రమేష్ టార్గెట్ చేశాడు.తన పేరు సుధాకర్ అని చెప్పుకుని కల్లూరు సమీపంలోని చల్లావారిపల్లెకు చెందిన వాడిగా పరిచయం చేసుకున్నాడు.తన భార్య అనారోగ్యంతో ఉందని, ఆపరేషన్ చేయాలని నమ్మించి ఆమె వద్ద రూ.1.50 లక్షల నగదు తీసుకెళ్లాడు.అంతటితో ఆగకుండా ఈ నెల 20వ తేదీన ఫోన్‌లో తన పేరు రాజుగా పరిచయం చేసుకుని స్కూటీ తక్కువ ధరకు ఇస్తానని నమ్మించి రూ.15వేలు క్యూఆర్ కోడ్‌కు వేయించుకొని ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు.ఈనెల 19వ తేదీన కల్లూరుకే చెందిన వ్యాపారి మహబూబ్‌బాషాకు ఫోన్ చేసి పులిచెర్ల మండలంలోని కురవపల్లికి చెందిన సుధాకర్‌గా పరిచయం చేసుకున్నాడు. స్కూటీ, ఫ్రిజ్, ఏసీ మిషన్ తక్కువ ధరకు ఇస్తానని నమ్మించి రూ: 48 వేలు క్యూఆర్ కోడ్‌కు వేసుకున్న రమేష్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు.ఆ ఇద్దరు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కల్లూరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.రమేష్‌ను అరెస్ట్ చేసి అతడి నుంచి రూ.1.40లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.







షార్‌లో సంబరాలు

సూళ్లూరుపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) విజయాశ్వం పీఎస్‌ఎల్వీ మరోసారి నమ్మకాన్ని నిలబెట్టింది.సోమవారం రాత్రి 10 గంటల 15 సెకన్లకు తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ థావన్ స్పేస్ సెంటర్ నుంచి నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళ్లి విజయకేతనం ఎగురవేసింది. స్పాడెక్స్ జంట ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలోకి విజయవంతంగా విడిచిపెట్టడంతో షార్‌లో సంబరాలు అంబరాన్నంటాయి.ఈ రాకెట్ ద్వారా 24 ఉపకరణాలను ఇస్రో శాస్త్రవేత్తలు వివిధ పరిశోధనల నిమిత్తం పంపారు. ఆదివారం రాత్రి 8.58 గంటలకు ప్రారంభమైన కౌంట్‌డౌన్ 25 గంటల పాటు నిర్విఘ్నంగా కొనసాగిన అనంతరం సోమవారం రాత్రి 10 గంటల 15 సెకన్లకు పీఎస్‌ఎల్వీ వాహక నౌక షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి దూసుకెళ్లింది.44 మీటర్ల పొడవుగల పీఎస్‌ఎల్వీసీ 60 రాకెట్ శిఖర భాగాన ఉన్న స్పాడెక్స్ జంట ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలో విడిచిపెట్టింది. తొలి ఉపగ్రహం 15.16 నిమిషాలకు విడిపోగా, రెండో ఉపగ్రహం 15.20 నిమిషాలకు భూమికి 476 కిలో మీటర్ల ఎత్తులో విజయవంతంగా రోదసీలో విడిచిపెట్టింది. సొంత అంతరిక్ష కేంద్రాన్ని రోదసిలో ఏర్పాటు చేసుకోవాలన్న భారత్ లక్ష్యాన్ని సుగమం చేసింది.



మీడియా సెంటర్‌లో మాట్లాడుతూ రాకెట్, ఉపగ్రహ నమూనాను చూపుతున్న ఇస్రో చైర్మన్ సోమనాథ్, శాస్త్రవేత్తలు

అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

చౌడేపల్లె, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): అభివృద్ధే లక్ష్యంగా అధికారులు, కార్యకర్తలు పనిచేయాలని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మండలంలోని తెల్లనీళ్లపల్లెలో మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి అతిథి గృహంలో అధికారులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీ, గ్రామం పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలన్నారు. ప్రతి పంచాయతీలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లీలామాధవి, ఏపీవో చిట్టెమ్మ, టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు ఓబుల్‌రెడ్డి, టీడీపీ నాయకులు ప్రదీప్‌రాజు, జంపాల శ్రీనివాసులునాయుడు, కళ్యాణ్, చంద్రమౌళి, వేలూరు సుబ్రహ్మణ్యం, కుమార్‌రెడ్డి, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న జనసేన నాయకులు



విద్యార్థినిని కళాశాలలో చేర్చుతున్న జనసేన నాయకులు

గంగవరం,డిసెంబరు30,(ఆంధ్రజ్యోతి): కళాశాలకు ఫీజు కట్టుకోలేక ఆగిపోయిన విద్యార్థినికి జనసేన నాయకులు ఫీజులు చెల్లించి, కళాశాలలో చేర్పించి మానవత్వం చాటుకున్నారు. స్థానిక గంగవరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో రేఖ అనే పేద విద్యార్థిని ఇంటర్ చదువుతోంది. అయితే కళాశాలకు ఫీజులు కట్టే స్థోమత లేక ఏడాదిగా కళాశాలకు వెళ్లకుండా ఆగిపోయింది. ఈ విషయం గుర్తించిన జనసేన గంగవరం మండల అధ్యక్షురాలు మంజుల కళాశాల ఫీజు చెల్లించారు. కళాశాలలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రమేష్, దాము, కవీశ్వర్, కృష్ణమూర్తి, శివకుమార్, రాజు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలిరండి

వి.కోట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జనవరి 5న విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావానికి హిందూ బంధువులందరూ తరలిరావాలని బిజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఘైందల రామచంద్రుడు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పీ.ఎన్.నాగరాజుకు కరపత్రాలను అందించి స్వాగతం పలికారు. లక్ష్మీనరసింహరావు, రామచంద్ర, శ్రీనివాసులు ఉన్నారు.

రైతులకు చిక్కులు లేకుండా రీసర్వే



అవగాహన ర్యాలీలో అధికారులు, నేతలు

రామకుప్పం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం చేసిన భూ రీసర్వే వల్ల ఇబ్బందులకు గురైన రైతులకు ఎటువంటి చిక్కులు లేకుండా కూటమి ప్రభుత్వం రీసర్వే నిర్వహిస్తుందని టీడీపీ రామకుప్పం మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. సోమవారం రీసర్వేపై డిప్యూటీ తహసీల్దారు బాలాజీ ఇతర రెవన్యూ అధికారులతో కలిసి మండల పరిధిలోని గిడ్డపల్లెలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీసర్వేపై జనవరి 2న గిడ్డపల్లెలో నిర్వహించే రెవెన్యూ సదస్సులో రైతులు పాల్గొనాలని కోరారు. డిప్యూటీ సర్వేయర్ నరేష్, గ్రామ సర్వేయర్ గణేష్, వీఆర్వో తాజ్‌రెడ్డి, నాయకులు శ్రీనాథరెడ్డి, మునిరెడ్డి, మంజునాథ్, మురళీమోహన్. చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

సంచారజాతుల సంఘం రామకుప్పం మండల కమిటీ ఏర్పాటు

రామకుప్పం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): సంచారజాతుల సంఘం రామకుప్పం మండల కమిటీ ఎన్నికలు సోమవారం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రవి, శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా జరిగాయి. మండల అధ్యక్షుడిగా వెంకటాచలపతి, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌బాబు, ప్రచార కార్యదర్శిగా నాగరాజు, ఉపాధ్యక్షులుగా జయప్ప, రాజప్ప, మంజునాథ్, సోమశేఖర్, కార్యదర్శులుగా రాజగోపాల్, రామప్ప ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు సుబ్రీ, మురళీ, మహేష్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

రామకుప్పం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో జనసేన పార్టీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని ఆ పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, ఎమ్మెల్యే అరణిశ్రీనివాసులు సూచించారని జనసేన రామకుప్పం మండల అధ్యక్షుడు హరీష్ తెలిపారు. సోమవారం తనతో పాటు మండల నాయకులు వారిని తిరుపతిలో కలిశామని ఆయన తెలిపారు. త్వరలో వారు కుప్పం పర్యటనకు వస్తామని తెలిపారని పేర్కొన్నారు. నాయకులు భాస్కర్, షహిన్‌షా, మహేష్ తదితరులు ఉన్నారు.

తాగునీటి బోర్ల డ్రిల్లింగ్



ఆవులకుప్పం, సింగసముద్రంలో బోర్లు వేస్తున్న దృశ్యాలు

రామకుప్పం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజవకర్గంలో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని గతంలో ఆదేశించారు. ఆ మేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రస్తుతం చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మండలం పరిధిలోని సింగసముద్రం, ఆవులకుప్పం, నీళ్లచేను, నల్లరాళ్లచేను, కుళ్లగానూరు, వేపనపల్లె, ఉస్సిగానిపల్లె, బల్దారు గ్రామాల్లో తాగునీటి బోర్ల తవ్వకం చేపట్టాలని నిర్ణయించారు. ఈ క్రమంలో సోమవారం ఆవులకుప్పం, సింగసముద్రం గ్రామాల్లో బోర్లు వేశారు. నీరు పుష్కలంగా పడింది. గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

అనారోగ్యంతో ఆత్మహత్య



రాజేష్ (ఫైల్‌ఫొటో)

గంగవరం, డిసెంబరు30,(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. గంగవరం మండలం కల్లుపల్లె గ్రామానికి చెందిన రాజేష్(26) డ్రమ్స్ వాయించేవాడు. అప్పుడప్పుడూ యాక్టింగ్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. కొంత కాలంగా రాజేష్‌కు ఆరోగ్యం సరిగా లేదు. సోమవారం సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. భార్య, కుటుంబ సభ్యులు ఇంటి బయట ఉండగా, భోజనం చేస్తానని ఇంటి లోపలికి వెళ్లి ఇనుప దువ్వకు ఉరివేసుకున్నాడు. ఎంతసేపటికీ అతడు బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి భార్య, కుటుంబసభ్యులు వెళ్లి చూడగా ఉరివేసుకొని ఉన్నాడు. వెంటనే అతడిని పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు.

అమ్మవారి ఆలయాల్లో అమావాస్య పూజలు

బైరెడ్డిపల్లె, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలో వున్న బాటగంగమ్మ ఆలయం, గుంతకురప్పల్లెలో వున్న సప్పలమ్మదేవి ఆలయం, దేవదొడ్డిలో అంకాళపరమేశ్వరీ ఆలయంలో సోమవారం అమావాస్య సందర్భంగా విశేషపూజలు నిర్వహించారు. అమ్మవార్లకు అభిషేకంచేసి ప్రత్యేకపూజలు జరిపారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

భూ సమస్య పరిష్కరించాలని నిరసన

బైరెడ్డిపల్లె, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవదొడ్డి గ్రామంలో యశోదమ్మకు చెందిన భూమిని కొందరు ఆక్రమించుకుని మోసంచేశారని దీనిపై రెవిన్యూ అధికారులు విచారణ జరిపి బాధితురాలికి తగిన న్యాయం చేయాలని జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలనా సంస్థ నాయ కులు మునిరత్నం, పార్థసారథి ఆధ్వర్యంలో బైరెడ్డిపల్లె రెవిన్యూకార్యాలయం ఎదుట బాధితురాలి కుటుంబీకులు సోమవారం నిరసన తెలిపారు. యశోదమ్మకు చెందిన దాదాపు రెండెకరాల భూమిని కొందరు అక్రమంగా ఆన్‌లైన్‌లో తమపేర్ల మీద నమోదు చేసుకున్నారని ఆరోపించారు.

సారా స్వాధీనం..ఒకరి అరెస్టు

సోమల, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): సోమల మండలం పేగలవారిపల్లె సమీంలో సారా విక్రయిస్తున్న శ్రీరాములను అదుపులోకి తీసుకుని 10లీటర్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శివశంకర్ తెలిపారు. అలాగే గ్రామ సమీపంలోని సారా ఊటను ధ్వంసం చేశారు. శ్రీరాములును పుంగనూరు కోర్టుకు తరలించారు.

ఆలయంలో చోరీ యత్నం

రామకుప్పం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం మిట్టపల్లెలోని పెద్దపులి గంగమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి చోరీయత్నం జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆలయ తలుపుల తాళాలను పగులగొట్టి ఆలయంలోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. అమ్మవారి మెడలో బంగారు తాళిబొట్టుతో బాటూ రూ.2లక్షలు విలువ చేసే వస్తువులున్నాయి. దుండగులు వాటిని తీసుకెళ్లలేదు. మద్యం మత్తులో ఎవరైనా చోరీకి యత్నించి ఉండవచ్చని స్థానికులు తెలిపారు. పోలీసులు ఆలయాన్ని సందర్శించారు. చోరీలు జరగకుండా ఉండాలంటే గ్రామస్తులు ఆలయాల్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని, స్మార్ట్‌లాక్‌లను వినియోగించాలని సూచించారు.

వృద్ధుడి అదృశ్యం

రామకుప్పం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం అయ్యప్పగానిపల్లెలో ఓ వృద్ధుడు నాలుగు రోజులుగా కన్పించకుండా పోయాడు. ఎస్‌ఐ వెంకటమోహన్ కథనం మేరకు.. అయ్యప్పగానిపల్లెకు చెందిన వెంకటేష్ శుక్రవారం ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రయినా అతను ఇంటికి చేరుకోలేదు. కుటుంబసభ్యులు అప్పటి నుంచి అతని కోసం చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల గ్రామాల్లో వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో వారు సోమవారం రామకుప్పం పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

పుంగనూరు రూరల్, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): పుంగనూరుకు చెందిన రాజేష్ కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 195 టెట్రా ప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ సురేశ్‌రెడ్డి తెలిపారు.

సీఎస్‌ఐ చర్చి అభివృద్ధికి కృషి

పుంగనూరు, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): పుంగనూరు సీఎస్‌ఐ చర్చి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సీఎస్‌ఐ చర్చిలో నూతనంగా నిర్మించిన మెమోరియల్ కన్వెన్షన్ హాలును ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ప్రారంభించారు. మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప పాల్గొన్నారు.

8 మంది జూదరుల అరెస్ట్

కల్లూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) పులిచెర్ల మండలం కల్లూరు సమీపంలోని బీసీ కాలనీ వద్ద సోమవారం పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు కల్లూరు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వారి నుంచి రూ: 7500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

డివిజనల్ కార్యాలయాలు ఏర్పాటుచేయాలి



కుప్పం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో అన్ని ప్రభుత్వ శాఖల డివి జనల్ స్థాయి కార్యాలయాలు ఏర్పాటు చేయాలని ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్, చెక్కునత్తం మణి, జేకే.సంతోశ్‌లు కడా పీడీ వికాస్ మర్మత్‌ను కోరారు. కుప్పం మండల సచివాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పీడీని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిశీలించి పరిష్కరిస్తామని కడా పీడీ వారికి హామీ ఇచ్చారు.

సీఎం వస్తున్నారు..అప్రమత్తంగా ఉండండి

● అధికారులకు కడా పీడీ హెచ్చరిక



అధికారులకు సూచనలిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): 'ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చే నెల 6, 7 తేదీల్లో కుప్పం వస్తున్నారు. జాగ్రత్తగా ఉండండి, మీమీ శాఖల పరిధిలో అన్ని రికార్డులు సరిగా పెట్టుకోండి. పనుల్లో వేగం పెంచండి. అప్రమత్తంగా ఉండండి' అని కడా పీడీ వికాస్ మర్మత్ ప్రభుత్వ శాఖాధికారులను హెచ్చరించారు. కుప్పంలోని మండల సచివాలయంలో సోమవారం కడా పీడీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు దీనికి హాజరయ్యారు. సాధారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటదాకా ప్రజలనుంచి ఫిర్యాదులు స్వీకరించే ఈ కార్యక్రమం సుమారు అర్ధగంట ముందుగానే ముగిసింది. వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించిన ప్రజలు సమస్యలను సావధానంగా విని, సంబంధిత శాఖాధికారులనుంచి వివరణ తీసుకున్నారు. వీలైనంత త్వరగా ఆయా సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం వివిధ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాల గురించి అధికారులతో సమీక్షించారు. నియోజకవర్గంలో జరుగుతున్న సిమెంటు రోడ్లు, గోకులం షెడ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. శాఖల వారీగా అందరూ జరుగుతున్న జరుగబోయే పనులతోపాటు, ప్రతిపాదనలు పంపిన వాటి వివరాలు పక్కాగా ఉంచుకోవాలన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా విద్యుత్ సంబంధిత సమస్యలు లేకుండా చూసుకోవాలని రెస్కో అధికారులకు సూచించారు. ఎక్కడా విద్యుత్ తీగలు తెగిపడకుండా, ధ్వంసమైన విద్యుత్ లైన్లను బాగు చేయాలని, శిథిలమైన వాటి స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండి వారి విధులను, బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

శ్రీవారి అన్నప్రసాదానికి 10టన్నుల కూరగాయల వితరణ



కూరగాయల వాహనానికి పూజలు చేస్తున్న దాతలు

పలమనేరు డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి అన్నప్రసాదానికి పలమనేరు కూరగాయల మార్కెట్‌లో దాతలు 10 టన్నుల కూరగాయలు వితరణ చేశారు. సోమవారం స్థానిక పలమనేరు మార్కెట్‌లో టీటీడీకి సంబంధించిన లారీలో వివిధ రకాల కూరగాయలు లోడ్ చేశారు. వాహనానికి పూజలు నిర్వహించి తిరుమలకు పంపారు. వీటిని తిరుమలలోని తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రానికి తరలిస్తామని శ్రీవారి సేవకులు కిషోర్‌స్వామి, కాపుపల్లె రవీంద్రారెడ్డి తెలిపారు. వీరి ఆధ్వర్యంలో ఐదేళ్లుగా తరచూ శ్రీవారికి కూరగాయల వితరణ జరుగుతోంది. ఈ కార్యక్రమంలో దాతలు మోహన్‌రెడ్డి, శ్యామ్, శ్రీకాంత్, జైసింగ్, బాలాజి, బాబు, ఓకేఆర్, పచ్చిపాల వెంకటేష్ పాల్గొన్నారు.

ఆలయ భూములను కాపాడుకుందాం

కల్లూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకుందామని పుంగనూరు నియో జకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి పంచాయతీలో సోమవారం చల్లా రామచంద్రా రెడ్డి పర్యటించారు. పులిచెర్ల, చెరువుముందురపల్లి, మంగళంపేట, మేదరపల్లి, కొత్తపేట, కొమ్మిరెడ్డిగారిపల్లిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మల్లేశ్వరకొండపై వెలసిన మల్లేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. స్వామి వారికి ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడారు. ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రహదారి అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించి ప్రణాళికలు రూపొందిద్దామని తెలిపారు. ఆలయానికి సంబంధించిన భూములు, వాటి ఫలసాయంపై స్థానిక నాయకులు చల్లా రామచంద్రారెడ్డికి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామనాథంనాయుడు, మురళీధర్, కుమార్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ధనంజయనాయుడు, వెంకటరమణ, మురళీధర్ నాయుడు, గోపి నాయుడు, నరేంద్రచౌదరి, ధనంజయ నాయుడు, లోకేష్, ప్రసాద్‌రాయల్, చెంగ్రలాయ నాయుడు, అరుణా చలంనాయుడు, ప్రసాద్, మునికృష్ణమనాయుడు, గురుమూర్తి, కరుణాకర్ నాయుడు, అనీల్, మహేష్, అబ్బాస్, మోహన్ దాస్, నాగరాజనాయుడు పాల్గొన్నారు.

లారీ చక్రాల కిందపడి డ్రైవర్ దుర్మరణం



దుర్మరణం చెందిన ఇంద్రసింగ్

వి.కోట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): లారీ చక్రాల కిందపడి మరో లారీ డ్రైవర్ మృతి చెందాడు. వి.కోట - కుప్పం ప్రధాన రహదారిలో పొంతనపల్లె క్రాస్ వద్ద ఈ ఘటన జరిగింది. సోమవారం తాడిపత్రి నుంచి తిరుచ్చికి పైపుల లోడుతో వెళుతున్న లారీని డ్రైవర్ టిఫిన్ తినేందుకు పొంతనపల్లె సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద రోడ్డు పక్కన ఆపాడు. అదేలారీలో వారి కంపెనీకే చెందిన తమిళనాడు రాష్ట్రం శంకేరికి చెందిన మరో డ్రైవర్ ఇంద్రసింగ్(55) కూడా వచ్చాడు. తన లారీ మరమ్మతులకు గురికావడంతో ఇంజిన్ సామగ్రి తీసుకుని వస్తున్నాడు. ఈ క్రమంలో హోటల్ వద్ద డ్రైవర్ వెనక్కు రావడంతో ఇంద్రసింగ్ ప్రమాదవశాత్తు ఆ లారీ చక్రాల కిందపడి చనిపోయాడు. ఘటనా స్థలం కర్ణాటకకు చెందిన ప్రాంతం కావడంతో బేతమంగళం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం




కెనమాకులపల్లె సదస్సులో మాట్లాడుతన్న గౌనివారి

శాంతిపురం/గుడుపల్లె,డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వం రైతులకు అన్నివిధాలా అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ శాంతిపురం, గుడుపల్లె మండలాల అధ్యక్షులు విశ్వనాథనాయుడు, బాబునాయుడు తెలిపారు. సోమవారం శాంతిపురం మండలం కెనమాకులపల్లె, గుడుపల్లె మండలం గుండ్లసాగరంలలో నిర్వహించిన రెవిన్యూ సదస్సుల్లో వారు మాట్లాడారు. వైసీపీ పాలనలో రైతులకు తీరని ద్రోహం జరిగిందన్నారు. ముఖ్యంగా భూముల రీసర్వేతో రైతులు తీవ్ర అవస్థలకు గురయ్యారని తెలియజేశారు. వైసీపీ చేసిన తప్పిదాల నుంచి రైతులను కాపాడేందుకే కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఆయా సదస్సుల్లో డీటీలు కౌలేష్, అష్రఫ్‌అలీ, నాయకులు విజయరామిరెడ్డి, ఉదయ్‌కుమార్, నాగరాజు, సుబ్రహ్మణ్యం, మణికంఠ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

పుంగనూరు రూరల్, డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణ, మండల పరిధిలోని విలువైన ప్రభుత్వ భూములు, వంకలను ఆక్రమణదారుల నుంచి కాపాడాలని బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా నాయకుడు పి.అయూబ్ ఖాన్, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు నరసింహలు కోరారు. సోమవారం పలమనేరు ఆర్డీవో భవానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని ఆర్టీసీ డిపో పక్కనే ప్రవహించే కాల్వను కొంతమంది ఆక్రమించారని తెలియజేశారు. రాయలచెరువు వంకను పూడ్చడం వల్ల స్కావెంజర్ కాలనీ, కొత్తయిండ్లు హైస్కూల్, మోర్ దుకాణం వెనుకవైపు, హెచ్‌డీఎఫ్‌సి బ్యాంకు ఎదురుగా, చౌడేపల్లె రోడ్డు, చెంగలాపురం వైపు ప్రవహించే కౌండిన్యనది కాల్వను కొంతమంది రాజకీయ నాయకులు ఆక్రమించి విక్రయించారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. మండల పరిధిలో గుడిసిబండ పంచాయతీ సమీపంలో బట్టందొడ్డి రెవెన్యూ లెక్కల్లో ఉన్న 256/1 గుట్ట పొరంబోకులో 1.55 ఎకరాలు, 256/2లో బంజరు భూమి 0.49సెంట్లు, 266/2లో 16.34ఎకరాలను ప్రభుత్వ భూమిని ఆక్రమించి విక్రయిస్తున్నారని ఫిర్యాదు చేశారు. భీమగానిపల్లె చెరువు మొరవను వైసీపీ నాయకులు ఆక్రమించారని తెలిపారు.

గుంతలమయమైన రోడ్డుకు మరమ్మతులు



రోడ్డు మరమ్మతు పనులు పరిశీలిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, డిసెంబరు 30: (ఆంధ్రజ్యోతి) మండలంలోని రొంపిచెర్ల- బోడిపాటివారిపల్లె పంచాయతీ వరకు రోడ్డు మరమ్మతు పనులకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి శ్రీకారం చుట్టారు. రొంపిచెర్ల నుంచి ఎర్రావారిపాళెం మండలానికి వెళ్లే రహదారిలో రొంపిచెర్ల, బోడిపాటి వారిపల్లె గ్రామాల వద్ద రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. దీనిపై ఈనెల 24న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన చల్లా రామచంద్రారెడ్డి రోడ్డు మరమ్మతు పనులు చేయిస్తున్నారు. ఈ కార్య క్రమంలో రొంపిచెర్ల సర్పంచ్ ఇబ్రహీంఖాన్, రాష్ట్ర కురబకుల కార్పొరేషన్ డైరెక్టరు ఉయ్యాల రమణ, బోడిపాటివారిపల్లె మాజీ సర్పంచ్ రవికుమార్ నాయుడు, టీడీపీ నాయకులు గౌస్‌పీర్‌ఖాన్, రామమూర్తి, నాగరాజ, హరిబాబు, హయత్‌బాష కిరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

సూరయ్యగారిపల్లె విద్యార్థిని ప్రతిభ



సిల్వర్ మెడల్ సాధించిన అనీషా

సోమల, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో సూరయ్యగారిపల్లె హైస్కూల్ విద్యార్థిని సిల్వర్ మెడల్ సాధించినట్లు హెచ్‌ఎం నిరంజన్‌కుమార్ తెలిపారు. గుంటూరులో జరిగిన పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టు రన్నరప్ నిలిచింది. ఈ పోటీల్లో అనీషా విశేష ప్రతిభ చూపడంతో సిల్వర్ మెడల్ అంద జేశారు. ఈ క్రమంలో ఆ విద్యార్థిని పాఠశాలలో పీడీ శివకుమార్, ఉపాధ్యాయులు విద్యావతి, సూర్యప్రకాశ్, కుసుమ, చంద్రకళ తదితరులు అభినందించారు.

స్వయంభేశ్వరస్వామికి అభిషేకపూజలు

సోమల, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): సోమలలో కొలువుదీరిన స్వయం భేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మూలవిరాట్‌కు ప్రత్యేక పుష్పాలతో అలంకరణలు చేశారు. అభిషేకపూజలు, అర్చనలు జరిపారు. ఉభయ దారులుగా శెట్టివారి జగన్, సావిత్రి దంపతులు వ్యవహరించారు. ఈ పూజల్లో ఆలయ ధర్మకర్త బీవీ.సోమశేఖర్, సుధాకర్, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌లో వినతుల వెల్లువ

సోమల, డిసెం బరు 30 (ఆంధ్ర జ్యోతి): స్థానిక రెవెన్యూ కార్యాల యంలో సోమ వారం నిర్వ హించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు వెల్లువెత్తాయి. తహసీల్దార్ బెన్నురాజ్ వినతిపత్రాలు స్వీకరించారు. అన్నెమ్మగారిపల్లెలో శ్మశానదారి సమస్య పరిష్కరించాలని మాజీ సర్పంచు బంగారప్పతో కలసి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. సమస్య పరిష్కరించాలని సర్వేయర్ షాన్‌వాజ్‌ను తహసీల్దార్ ఆదేశించారు. కుల గణనలో జరిగిన పొరబాట్లను సరిదిద్దాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు తహసీల్దార్‌ను కోరారు. మరికొందరు వన్‌బీలో తమ భూముల వివరాలు సక్రమంగా లేవని పొరపాట్లు సరిచేయాలని విన్నవించారు. పలువురు పొలాల వద్దకు దారుల ఆక్రమణపై ఫిర్యాదు చేశారు.

గోకుల షెడ్ నిర్మాణాలు వేగవంతం చేయాలి

సోమల, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం నిధులతో గోకులాల షెడ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఏపీడీ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం సోమల మండలంలో జరుగుతున్న పనులను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. సోమల, అడుసుపల్లె, నంజంపేట, చిన్నఉప్పరపల్లెలో పలు అభివృద్ధి పనులను పరిశీలిచారు. ఆయన వెంట ఏపీవో దినకర్‌బాబు, క్షేత్రసిబ్బంది పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయాలి

సోమల, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావం మహాసభను ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు హేమగిరి పిలుపునిచ్చారు. సోమవారం దుర్గంకొండ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వీహెచ్‌పీ నాయకులతో కలసి పెద్దఉప్పరపల్లె, పేటూరు, బసవపల్లె, అన్నెమ్మగారిపల్లె పంచాయతీలో ఇంటింట శంఖారావం సభ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రమణ, వెంకటరత్నం పాల్గొన్నారు.

వీఆర్‌ఓల సంఘం కార్యవర్గం ఏకగ్రీవం



వీఆర్‌ఓల సంఘం నూతన కార్యవర్గం

కల్లూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మండలంలోని వీఆర్‌ఓలు సమావేశం ఏర్పాటుచేసి వీఆర్‌ఓల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అన్ని పదవులూ ఏకగ్రీవమయ్యాయి. వీఆర్‌ఓల సంఘం మండల అధ్యక్షుడిగా రెడ్డెప్ప, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు, కార్యదర్శిగా వెంకటరత్నం, సంయుక్త కార్యదర్శిగా శకుంతల, కోశాధికారిగా సుబ్బరామయ్య ఎన్నికయ్యారు.

టీడీపీ నాయకుడు కృష్ణమూర్తికి నివాళి



బైరెడ్డిపల్లె, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు కృష్ణమూర్తి(45)కి పలువురు నివాళులర్పించారు. నాలుగురోజులుగా అనారోగ్యంతో తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందు తున్న ఆయన సోమవారం మృతిచెందారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు తదితరులు ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.

మద్యం మత్తులో ప్రమాదవశాత్తూ చేతివేళ్లు నరుక్కున్నాడు

సోమల, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కొబ్బరికాయను నరకబోయి మద్యం మత్తులో ప్రమాదవశాత్తూ చేతివేళ్లు నరుక్కున్నాడు ఓ మందుబాబు. వడ్డిపల్లెకు చెందిన రాజన్న సోమవారం సాయంత్రం మద్యం సేవించాడు. ఈక్రమంలోనే కొబ్బరి కాయలను కత్తితో నరుకుతుండగా కుమారుడు పలకరించాడు. మాట్లాడుతూ నరికే క్రమంలో చేతివేళ్లను నరికేసుకున్నాడు. రెండు వేళ్లు తెగిపడ్డాయి. 108 లో పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

రొంపిచెర్ల, డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి అధికారులు, కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శాఖాపరంగా గోకులాల నిర్మాణాలు, ఎన్ఆర్‌జీఎస్‌లో రహదారులు, గృహనిర్మాణాలు, మురుగునీటి కాలువలు, సీసీ రోడ్లు, పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణ పనులపై చర్చించారు. సంక్రాంతిలోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఈ 31వ తేదీన పెన్షన్లు వంద శాతం పంపిణీ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్‌డీ సత్యంరెడ్డి, ఇంజనీర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హనుమజ్జయంతి



పొన్నియమ్మ గుడి వీరాంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే తదితరులు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో సోమవారం హనుమజ్జయంతి ఉత్సవాలు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. 75 దొడిపల్లె శ్రీరామ భజనమందిరంలో నిర్వహించిన ఉత్సవాల్లో ఎమ్మెల్యే జగన్మోహన్, గురజాల చెన్నకేశవులు నాయుడు పాల్గొనగా, వారికి ఒకటవ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ గోపాల క్రిష్ణన్, మాజీ కార్పొరేటర్ నళిని, తిరుకుమరన్‌లు స్వాగతం పలికి పూజలకు ఏర్పాట్లు చేశారు. అదే విధంగా పొన్నియమ్మ గుడి వీరాంజనేయస్వామి ఆలయంలో వారు పూజలు చేశారు. ఆలయ ఈవో వెంకటరాయులు అర్చకులు సుధాకర్ గురుకుల్‌లు స్వాగతం పలికారు. నగర మేయర్ అముద, చుడా చైర్మన్ కఠారి హేమలత తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరు మండలం వేల్కూరు గ్రామంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రధాన అరకులు నరసింహఅయ్యంగార్ ఆధ్వర్యంలో హోమం పూజలు, గర్భగుడిలో వీరాంజనేయస్వామి విగ్రహానికి వేద మంత్రాలు, మేళతాళాల మధ్య అభిషేకం పూజలు నిర్వహించారు.

భక్తి ప్రపత్తులతో అమావాస్య పూజలు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక గుర్రప్ప నాయుడు వీధిలో వెలసిన అంకాల పరమేశ్వరి అమ్మవారికి ధనుర్మాస అమావాస్య పూజలు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ఆలయ అర్చకులు బి.కుమార్ అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి విశేష అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భేష్... తన్వీర్



అబాకస్ విజేత తన్వీర్‌ను అభినందిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ, జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో మొదటి బహుమతి పొందిన చిత్తూరు నగర విద్యార్థి మహ్మద్ తన్వీర్‌ను కలెక్టర్ సుమిత్ కుమార్ అభినందించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో జరిగిన కార్యక్రమంలో చిత్తూరు ప్రశాంత్‌నగర్‌లో నివాసముంటున్న జక్రియా, సబీహా దంపతుల కుమారుడు స్థానిక శ్రీచైతన్యలో 6వ తరగతి చదువుతున్న మహమ్మద్ తన్వీర్ ఈనెల 16న న్యూఢిల్లీలో అబాకస్ యూసిమాస్ నిర్వహించిన పోటీల్లో అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి పొందాడు. ఈ సందర్భంగా నిర్వాహకులు అందించిన రెండు ఛాంపియన్ ట్రోఫీలను వారి తల్లిదండ్రుల సమక్షంలో కలెక్టర్ అందిస్తూ చదువులో సైతం చక్కగా రాణించాలని ఆశీర్వదించారు.

శ్మశానానికి వెళ్లే మార్గాన్ని మూసివేయకండి



జాతీయ రహదారి పీడీకి వినతిపత్రం అందిస్తున్న గుడికంభ్రిగ వాసులు

నగరి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని గుడికంభ్రిగ గ్రామానికి చెందిన శ్మశాన దారిని వంతెన నిర్మించి మూసివేయవద్దని జాతీయ రహదారి ప్రాజెక్టు డైరెక్టర్‌కు, స్పందనలో కలెక్టర్‌కు సోమవారం గ్రామస్థులు వినతిపత్రం అందించారు. తమ గ్రామంలో ఎవరైనా చనిపోతే శ్మశానానికి తీసుకెళ్లడానికి వంతెన నిర్మాణంతో మూసుకుపోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. శవం తీసుకెళ్లాలంటే సుమారు 3కి.మీ తిరిగి తీసుకెళ్లాల్సి వస్తుందన్నారు. వంతెన నిర్మాణ ప్రాంతాన్ని మార్చి తమకు శ్మశానానికి వెళ్లే దారిని యథావిధిగా ఉంచాలని, లేకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కల్పించాలని కోరారు. స్పందించిన పీడీ సంఘటనా స్థలాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

బీసీల నామ సంవత్సరంగా 2025: టీడీపీ

చిత్తూరు సిటీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీసీల నామ సంవత్సరంగా 2025 గుర్తింపు పొందిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయ చరిత్రలోనే ఒక బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి విజయానంద్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమించడం సంచలనమని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో బీసీలు అణచివేతకు, దాడులకు గురయ్యారని అన్నారు. కూటమి ప్రభుత్వం బీసీలకు ప్రభుత్వ ఉన్నత పదవుల్లో పెద్దపీట వేసిందని చెప్పారు. రాష్ట్ర డీజీపీగా, టీటీడీ ఈవోగా, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా, శాసనసభ స్పీకర్‌గా బీసీలను నియమించి వారి ఆత్మగౌరవాన్ని పెంచిన ఘనత టీడీపీకే దక్కిందని కొనియాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో జగన్‌రెడ్డి నిబంధనలు పాటించకుండా, సీనియారిటీని గౌరవించకుండా తన సొంత సామాజిక వర్గానికి చెందిన వారికే ఉన్నత పదవులు కట్టబెట్టారని చెప్పారు. టీడీపీ అన్నివర్గాల వారికి తగిన గుర్తింపు ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో నేతలు మోహన్‌రాజ్, మేషాక్, గోపాల్, బాలకృష్ణ నాయుడు, సురేష్, కరుణాకర్, శ్రీరాములు నాయుడు, శరవణ, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు ఘన స్వాగతం

బంగారుపాళ్యం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు బంగారుపాళ్యం ముస్లిం సోదరులు, టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. సోమవారం చిత్తూరు వెళుతున్న ఆయన్ను బంగారుపాళ్యంలో టీడీపీ నాయకులు, ముస్లిం సోదరులు అబ్దుల్లా, షబీర్, సోము, గోవిందాచ్చారిలు శాలువలతో ఘనంగా సన్మానించారు.

దారిసమస్య ఫిర్యాదుపై డీపీవో విచారణ



రసూల్‌నగర్‌లో దారి సమస్యను పరిశీలిస్తున్న డీపీవో సుధాకరరావు

యాదమరి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దారి సమస్యపై వచ్చిన ఫిర్యాదును జిల్లా పంచాయతీ అధికారి సుధాకరరావు పరిశీలించారు. మండల పరిధిలోని 12 కమ్మపల్లి పంచాయతీ రసూల్‌నగర్ గ్రామంలో రైతు రఘుపతి తన పొలానికి దారి సమస్య పరిష్కారం చూపాలని ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదుచేశారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల ప్రకారం సోమవారం డీపీవో సుధాకరరావు, ఎంపీడీవో వేణు, తహసీల్దార్ పార్థసారథి, ఈవోపీఆర్డీ సుకుమార్ రెడ్డి, పంచాయతీ సిబ్బందితో పరిశీలించి దారి సమస్యను పరిష్కరిస్తామని హామీయిచ్చారు.

చట్టాలపై అవగాహన

యాదమరి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహనకు సివిల్‌రైట్స్ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పార్థసారథి అన్నారు. సోమవారం మాదిరెడ్డిపల్లి ఆదిఆంధ్రవాడ గ్రామంలో సివిల్ రైట్స్ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో మెలగాలని, జీవన ప్రమాణాలను మెరుగుపరచుకోవాలన్నారు.దళిత గ్రామాల్లో సమస్యలను సృష్టిస్తే సమస్యకు కారకులైన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో పెండింగ్‌లో వున్న ఏఏడబ్ల్యూ ఇళ్ల పట్టాలు, తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు తహసీల్దార్‌ను కోరారు. ఆర్‌ఐ ప్రసాద్, వీఆర్వో సురేష్, సంఘ నాయకులు మురుగేశన్, నాగరాజు, కుమార్ పాల్గొన్నారు.

కృష్ణాపురం రిజర్వాయర్ గేటెత్తారు

వెదురుకుప్పం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలంలోని కృష్ణాపురం రిజర్వాయర్ గేటును సోమవారం రాత్రి జల వనరులశాఖ అధికారులు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఇన్‌ఫ్లో రావడం వల్ల ఓ గేటును ఎత్తి నీటిని వదిలారు.

కొబ్బరికి పంట రాయితీ

● మూడు సంవత్సరాలకు రూ.20 వేలు

బంగారుపాళ్యం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యానశాఖ అధికారి సాగరిక ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ రైతులు కొబ్బరి పంటపై మక్కువ చూపాలని అన్నారు. ప్రభుత్వం కొబ్బరి పంటకు మూడు సంవత్సరాలు విడతలవారీగా రాయితీ నగదు రూ.20 వేలు అందజేస్తుందని తెలిపారు. రైతులు కొబ్బరి సాగుపై దృష్టి పెట్టాలనిఅన్నారు. వ్యవసాయ శాఖ అధికారి చిట్టిబాబు, కొబ్బరి పరిశ్రమ సిబ్బంది మనోజ్ పాల్గొన్నారు.

మామిడి పంట సస్యరక్షణపై శిక్షణ

శ్రీరంగరాజపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీరంగరాజపురం వెలుగు కార్యాలయంలో సోమవారం మామిడి పంట సస్యరక్షణ చర్యలపై రైతులకు జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన రెడ్డి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మామిడిలో పూత నుంచి కోత వరకు చీడ పీడల గురించి అవగాహన కల్పించారు. మామిడికి ప్రత్యామ్నాయ పంటగా ఆయిల్ పామ్‌ను, అందులో కోకోను అంతరపంటగా వేసుకోవచ్చని సూచించారు. అమ్మా ఆయిల్ పామ్ కంపెనీ సిబ్బంది మహేష్, మనోజ్, ఎస్ఆర్‌పురం సర్పంచ్ దిలీప్, పద్మాపురం సర్పంచ్ భాస్కర్ నాయుడు, రైతు సేవ కేంద్రం సిబ్బంది ఢిల్లీ ప్రియాంక, జోస్లినా, భరత్, ప్రియ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ క్యాలెండర్ ఆవిష్కరణ

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రూపొందించిన 2025 సంవత్సరపు బ్యాంకు క్యాలెండర్‌ను జేసీ, బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి జి.విద్యాధరి ఆవిష్కరించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని జేసీ ఛాంబర్‌లో ఆమె ఆవిష్కరిస్తూ సొసైటీల లావాదేవీల్లో పారదర్శకతను తీసుకువచ్చేందుకై కంప్యూటరీకరణ చేస్తున్నట్లు తెలిపారు. రైతుల కోసం విరివిగా పంటరుణాలు అందజేయాలని, డిపాజిట్ల సేకరణ పెంచడంతో పాటు రికవరి శాతాన్ని కూడా పెంచాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈవో మనోహర్ గౌడ్, జీఎం లిల్లీ కేథరిన్, డీజీఎం కె.వెంకటాచలపతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ ముద్రించిన 2025 వార్షిక క్యాలెండర్‌ను సోమవారం డీఈవో వరలక్ష్మి తన చాంబర్‌లో ఆవిష్కరించారు. సంఘం నాయకులకు డీఈవో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏడీ వెంకటేశ్వర్లు, ఎస్టీయూ రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షుడు గంటా మోహన్, జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్, ఆర్థిక కార్యదర్శి యువరాజు, చంద్రన్, రాధాకుమారి, ఢిల్లీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల భరోసా కోసమే సభ్యత్వ నమోదు

పెనుమూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా కొనసాగుతుంది. క్లస్టర్ ఇన్చార్జి పూజారి భాస్కర్ ఆధ్వర్యంలో సోమవారం చిన్నకలిగిరి గ్రామంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యకర్తల భరోసా కోసమే పార్టీ ఈ సభ్యత్వ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సెల్వరాజ్, మణి, మురుగన్, రవి, చిట్టి, వాసు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టు వీఆర్వోల సంఘం అధ్యక్షుడిగా బాబు



అధ్యక్షుడు బాబు, ఉపాధ్యక్షుడు మంజునాథ్

పూతలపట్టు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడుగా కొత్తపల్లి బాబును సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మంజునాథ్, కార్యదర్శిగా శోభారాణి, కోశాధికారిగా మాధవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వినతులకు సత్వర పరిష్కారం చూపండి

చిత్తూరు అర్బన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చిన అర్జీలకు సత్వరం పరిష్కారం చూపాలని కమిషనర్ నరసింహప్రసాద్ ఆదేశించారు. సోమవారం ఆయన కార్యాలయ ఆవరణలో బాధితుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. కొన్ని సమస్యలకు అక్కడికక్కడే కమిషనర్ పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. సోమవారం నాటి కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగానికి 2, పింఛన్‌కు ఒక్క అర్జీ అందాయి. ఈకార్యక్రమంలో ఏసీ ప్రసాద్, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐగా రవికుమార్

చిత్తూరు సిటీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐగా ఎం.రవికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో అనంతపురం జిల్లాలో చెక్‌పోస్ట్ సీఐగా విధులు నిర్వహిస్తున్న ఈయన బదిలీపై చిత్తూరు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐగా వచ్చారు. సోమవారం స్థానిక కట్టమంచిలోని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో డీసీ విజయకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐ మాట్లాడుతూ జిల్లాలో సారా, అక్రమ మద్యం రవాణా, గంజాయి తదితర మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు కృషిచేస్తానని చెప్పారు.

డయింగ్ యూనిట్లను మూసేయండి

● మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ల డిమాండ్

● అన్ని యూనిట్లు ఆపేస్తే.. నేనూ ఆపేస్తా: చైర్మన్



మున్సిపల్ సమావేశంలో డయింగ్ యూనిట్లపై వాదిస్తున్న కౌన్సిలర్లు

నగరి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని డయింగ్ యూనిట్లను మూకుమ్మడిగా మూసేయించాలని పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ సమావేశంలో డిమాండ్ చేశారు. నగరి మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ సమావేశం జరిగింది. కౌన్సిలర్ బీడీ భాస్కర్ మాట్లాడుతూ డయింగ్ యూనిట్ల కారణంగా నగరిలో ఎక్కువ మంది కిడ్నీ వ్యాధులు, సొరియాసిస్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారన్నారు. దీంతో సభ్యులందరూ ఏకగ్రీవంగా డయింగ్ యూనిట్లను మూసేయాలని పట్టుబట్టి ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు. నగరిలో 20 డయింగ్ యూనిట్లుండగా అందులో కేవలం రెండింటికి మాత్రమే అనుమతులున్నాయని, ఏ యూనిట్ కూడా నిబంధనలను పాటించడం లేదని అధికారులు తెలిపారు. చైర్మన్ నీలమేఘం మాట్లాడుతూ.. తాను కూడా ఆ సామాజిక వర్గానికి చెందిన వాడినేనని, తనకూ డయింగ్ యూనిట్ ఉందని చెప్పారు. కౌన్సిలర్లందరూ తీర్మాణిస్తే తాను కూడా కట్టుబడి ఉంటానన్నారు. అన్ని డయింగ్ యూనిట్లు మూసేస్తే తన యూనిట్‌ను కూడా మూసేస్తానని తెలిపారు. డయింగ్ యూనిట్లను శివారు ప్రాంతాలకు తరలించాలని ఆయన సూచించారు. వీధి దీపాలను త్వరలోనే బాగు చేయిస్తామని మున్సిపల్ డీఈ తెలిపారు. కాకవేడు పరిధిలో సర్వేనెంబరు 12సిలోని 4.944 హెక్టార్ల విస్తీర్ణంలో జాతీయ రహదారి 205 వెడల్పుకు గ్రావెల్ తీసుకోవడానికి ఈకేకే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ వారికి అనుమతి ఇచ్చేందుకు కౌన్సిల్ ఆమోదం కోరారు. ఎన్నో హెక్టార్ల భూముల్లో గ్రావెల్ క్వారీలను ప్రైవేటు వ్యక్తులకు ఇష్టారాజ్యంగా ఇచ్చారని.. నాడు కౌన్సిల్ ఆమోదం కోరని వారు నేడెందుకు కోరుతున్నారని కౌన్సిలర్ దయానిధి ప్రశ్నించారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ బడులు



బ్రోచర్ విడుదల చేస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే జగన్మోహన్ అన్నారు. సోమవారం స్థానిక బీఎస్ కన్నన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యుల శిక్షణ తరగతులకు ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా పాల్గొని పలు సూచనలు చేశారు. విద్యా విలువలను మరింత పెంచడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు రాణించాలన్నారు. కార్యక్రమంలో చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద, ఏపీ ఉమెన్ కార్పొరేషన్ మాజీ మెంబర్ రాజేశ్వరి, ఎంఈవో సెల్వరాజ్, మోహన్, ఎస్ఎంసీ చైర్మన్ నాగేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీ

● తండ్రీకొడుకులకు తీవ్రగాయాలు



గాయపడ్డ తండ్రీకొడుకులు

యాదమరి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో తండ్రీకొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు మండల పరిధిలోని బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిపై కుక్కలపల్లి క్రాస్ వద్ద పెనుమూరు మండలం పూనేపల్లికి చెందిన ఖాదర్ అలీ, కుమారుడు బర్కత్ అలీతో కలిసి సోమవారం బంగారుపాళ్యానికి తమ సొంత పనిపై చిత్తూరు వైపు నుంచి ద్విచక్రవాహనంలో వెళుతుండగా, బంగారుపాళ్యం వైపు నుంచి ఎదురుగా రాంగ్‌రూట్‌లో ఒక ట్రాక్టర్ డ్రైవర్ అతివేగంగా వచ్చి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మోటర్‌సైకిల్ నడుపుతున్న బర్కత్ అలీ తీవ్రంగా, వెనుకవైపు కూర్చొనివున్న అతడి తండ్రి ఖాదర్ అలీ గాయపడ్డారు. స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

టిప్పర్‌ను ఢీకొన్న స్కూటర్

- ముగ్గురికి తీవ్ర గాయాలు

పూతలపట్టు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): టిప్పర్‌ను స్కూటర్ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు కూలీలు తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. పెనుమూరు మండలం అత్తిమాకులపల్లి గ్రామానికి చెందిన లక్ష్మమ్మ, రోజా, జగన్‌లు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఈ ముగ్గురూ ప్రతి రోజూలాగానే కూలీపనుల కోసం పూతలపట్టు మండలం బత్తలవారిపల్లె వద్ద ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా, అడవిపల్లి నుంచి పూతలపట్టు వైపు వెళ్తున్న టిప్పర్ వెనుక చక్రానికి ద్విచక్ర వాహనం తగలడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం స్థానికులు 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో వేలూరు సీఎంసీకి తరలించారు. ఈ మేరకు పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మధ్యాహ్న భోజనానికి ప్లేట్ల వితరణ



విద్యార్థులకు ప్లేట్లు అందజేస్తున్న డీఐఈవో సయ్యద్ మౌల

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం జనవరి 3 నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తోందని డీఐఈవో సయ్యద్ మౌల తెలిపారు. స్థానిక బీఎస్ కన్నన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని 150 మంది విద్యార్థులకు రూ.18 వేలు విలువ చేసే ప్లేట్లను కేఆర్ జ్యోతి వితరణగా ఇచ్చారు. వీటిని డీవైఈవో సయ్యద్ మౌల విద్యార్థులకు అందజేసి, దాతలు ముందుకు రావడాన్ని స్వాగతించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న గద్దె రామ్మోహన్‌రావు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సైన్స్ పోటీల్లో చిత్తూరు జిల్లా విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. సోమవారం విజయవాడలోని స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కాలేజ్‌లో భారతి విజ్ఞాన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. క్విజ్, రీల్స్, పోస్టు ప్రెజెంటేషన్ విభాగాల్లో జిల్లా నుంచి 11 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రీల్స్ విభాగంలో చిత్తూరు పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెన్త్ చదువుతున్న ఆకాష్ మొదటి స్థానం కైవసం చేసుకోగా, పోస్టు ప్రెజెంటేషన్‌లో పుంగనూరు కొత్తఇండ్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన మహ్మద్ షాక్విద్ తృతీయ స్థానంలో నిలిచారు. వీరిని డీఈవో వరలక్ష్మి, డీవైఈవో చంద్రశేఖర్ తదితరులు అభినందించారు.

ప్రభుత్వ డ్రైవర్లు వాహనాలు జాగ్రత్తగా నడపాలి

చిత్తూరు అర్బన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వాహనాలు నడిపే డ్రైవర్లు జాగ్రత్తగా వాహనాలను నడపాలని ప్రభుత్వ డ్రైవర్ల సంఘం మాజీ అధ్యక్షుడు పన్నీర్ శెల్వం కోరారు. నూతన సంవత్సరం 2025ను పురస్కరించుకుని సోమవారం పలువురు డ్రైవర్ల సమక్షంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టి శుభాకాంక్షలు తెలిపారు. అన్ని శాఖల డ్రైవర్లకు స్వీటు బాక్సులను పంపిణీ చేశారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులతో హెచ్‌ఎం కోమల, పీడీ దేవా

ఐరాల, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల జమ్మూకాశ్మీర్‌లో జరిగిన జాతీయ స్థాయి సబ్‌జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ పోటీలలో ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు హెచ్‌ఎం కోమల సోమవారం తెలిపారు. ఈ పోటీలలో పాఠశాలకు చెందిన ప్రకాష్ బాలుర విభాగంలో ప్రతిభ చూపి కాంస్య పతకం సాధించినట్లు ఆమె పేర్కొన్నారు. బాలికల విభాగంలో భవిత రజిత పతకాన్ని సాధించినట్లు తెలిపారు. ఇందుకు కృషి చేసిన పీడీ దేవా, విద్యార్థులను ఆమె సన్మానించారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

పెనుమూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశులు నాయుడిని మాజీ జడ్పీటీసీ రుద్రయ్య నాయుడు సోమవారం సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా వెంకటేశులు నాయుడు సేవలు మరువలేనివని కొనియాడారు. నేడు పదవీ విరమణ చేయుచున్న ఆయన శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని అన్నారు. ఎంఈవో భాస్కర నాయుడు, హెచ్‌ఎం యామిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో పేరు మార్చేశారు...

గంగాధరనెల్లూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తమకు భూమిని విక్రయించిన వ్యక్తి అదేభూమిని మరొకరికి విక్రయించారని తహసీల్దార్ చంద్రశేఖర్‌కు తూగుండ్రం పంచాయతీ బాలయ్య కొత్తూరుకు చెందిన దొరస్వామిరెడ్డి, గోవిందరెడ్డిల వారసులు ఫిర్యాదు చేశారు. సోమవారం గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమపేర్లు తీసేసి మరో రైతు కుటుంబీకుల పేర్లతో ఆన్‌లైన్‌లో పెట్టారని పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని తహసీల్దార్‌కు దొరస్వామిరెడ్డి వారసులు విజ్ఞప్తి చేశారు. పలువురు రైతులు తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఈకార్యక్రమంలో ఆర్‌ఐ ఏకాంబరం, వీఆర్వో ప్రవీణ్, టీడీపీనేతలు నరసింహులు నాయుడు, నియాజ్‌అలీ, నీరజాక్షులురెడ్డి పాల్గొన్నారు.

ఐరాల: రెవెన్యూ సదస్సు వచ్చిన ప్రతి సమస్యను తప్పక పరిష్కరిస్తామని తహసీల్దార్ మహేష్‌కుమార్ అన్నారు. సోమవారం నాంపల్లె రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన సదస్సులో 26 మంది రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని అర్జీలను సమర్పించారు.సర్పంచులు స్వర్ణ, దయానంద నాయుడు, సులోచన, ఎంపీటీసీ మమత, మాజీ వైస్‌ఎంపీపీ ధనంజయ నాయుడు, మాజీ సర్పంచ్ బాలకృష్ణమ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: రైతుల భూ సమస్యలను పరిష్కరిస్తామని కార్వేటినగరం తహసీల్దార్ నాగరాజు తెలిపారు. కార్వేటినగరం మండలం అన్నూరులో సోమవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రైతుల నుంచి అందిన వినతిపత్రాలను స్వీకరించారు.

లాయర్ల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

చిత్తూరు లీగల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కోర్టుకు సంబంధించి 2025-2026 న్యాయవాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నల్లారి ద్వారకనాథ్ రెడ్డి రూపొందించిన నూతన క్యాలెండర్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భీమరావు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీజే మాట్లాడుతూ ఈ క్యాలెండర్ న్యాయవాదులతో పాటు న్యాయమూర్తులకు కూడా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి సాయం

చిత్తూరు సిటీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 3వ డివిజన్ దొడ్డిపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త మహేంద్రన్ గత కొన్ని రోజులుగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ ఆదివారం మృతిచెందాడు. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే జగన్మోహన్ సోమవారం మహేంద్రన్ మట్టిఖర్చులకు గాను ఆయన కుటుంబ సభ్యులకు రూ.10వేలు అందజేశారు. చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, 3వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి గోపాలకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన గొర్రె అప్పగింత

పాలసముద్రం, డిసెంబర్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లయ్యగుంట గ్రామానికి చెందిన గంగాధరం ఆదివారం గొర్రెలను నరసింహాపురం అడవులలో మేత కోసం తరలించాడు. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చే క్రమంలో ఓ గొర్రె అడవిలోనే తప్పిపోయింది. పాలసముద్రం ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తన సిబ్బందితో అటవీ మార్గం ద్వారా నరసింహాపురం వెళుతుండగా అటవీ ప్రాంతానికి సమీపంలో గొర్రె ఒంటరిగా కనిపించింది. సిబ్బంది సహకారంతో గొర్రెను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. తప్పిపోయిన గొర్రె స్టేషన్‌లో ఉందని సమీప గ్రామాలలో పోలీసులతో సమాచారం చేరవేశారు. సోమవారం గంగాధరం తన గొర్రె తప్పిపోయిందని.. స్టేషన్‌లో ఉన్న గొర్రె తనదేనని చెప్పడంతో ఆయనకు అప్పగించారు. గొర్రెను యజమానికి అప్పగించడం పట్ల ఎస్ఐ చిన్నరెడ్డెప్పను పలువురు అభినందించారు.

రంగంపేట కాలనీ సమస్యలు పరిష్కరించండి

పూతలపట్టు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తేనేపల్లి పంచాయతీ రంగంపేట గ్రామ సమీపాన గల కాలనీసమస్యలు పరిష్కరించండంటూ కాలనీవాసులు సోమవారం ఈవోఆర్డీ, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పించారు. వర్షం కురిస్తే సమీపాన గల చెరువు నుంచి మురికినీరు కాల్వల్లోకి వస్తోందని, కాలనీలో డ్రైనేజీ కాలువ ఏర్పాటు చేయాలని వినతిపత్రం సమర్పించారు.

సారా ఊట ధ్వంసం

చిత్తూరు సిటీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు అర్బన్ స్టేషన్ పరిధిలో 2700 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ శ్రీహరి రెడ్డి చెప్పారు. సోమవారం గుడిపాల మండలం రాసనపల్లి పరిసర ప్రాంతాల్లోని పిల్లిగుట్ట, సర్దార్ మిట్ట, ఊటవంక తదితర ప్రాంతాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించామని తెలిపారు. ఈదాడుల్లో సుమారు 2700 లీటర్ల సారా ఊటను గుర్తించి, ధ్వంసం చేసి మూడు కేసులు నమోదు చేశామని అన్నారు.

పట్టా భూముల్లో పంటలు మునిగిపోతున్నాయి

● పన్నూరు వాసుల ఫిర్యాదు



కళియంబాకం రెండవ చెరువులో మట్టితో కప్పివేసిన తూము

విజయపురం, డిసెంబరు 30: పట్టా భూముల్లో సుమారు 100 ఎకరాలకు పైగా పంటలు మునిగిపోతున్నాయని పన్నూరు వాసులు సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళియంబాకం రెండవ చెరువు(కడపేరి) ఐదు సంవత్సరాల క్రితం మరమ్మతు చర్యల్లో భాగంగా మొరవ పెంచడం వలన పట్టా భూముల్లో పంటలు మునిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కళియంబాకం - పన్నూరు దళితవాడకు మధ్యలో చెరువు ఉండడంతో ఎక్కువ మంది రైతులు నష్టపోతున్నారని వాపోయారు. చెరువు నుంచి నీరు బయటకు వచ్చే తూములను కొందరు రైతులు పూర్తిగా మూసివేయడం వలన ఉన్న పంటలు మునిగిపోతున్నాయని, కొత్తగా పంటలు చేయలేక పోతున్నామని చెబుతున్నారు. సంఘటనా స్థలాన్ని మండల వ్యవసాయాధికారిణి సందర్శించారు. తహసీల్దార్, ఇరిగేషన్ ఏఈలకు సమాచారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, పలువురు నాయకులు పాల్గొన్నారు.